Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 2 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 26 జనవరి 2024 | శుక్రవారం | పేజీలు : 4

## ఫ్రాన్స్ అధ్యక్షుడి స్వాగతానికి ఏర్పాట్లు పూర్తి

### కీలకాంశాలు చర్చించనున్న మోదీ - మాక్రాన్

ఢిల్లీ: ప్రతి ఏడాదిలాగే ఈ గణతంత్ర దినోత్సవానికి ఢిల్లీలో జరిగే పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ముఖ్య అతిథి రాబోతున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు ప్రభుత్వం ఇప్పటికే ఆహ్వానం పంపింది. భారత 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన చీఫ్ గెస్ట్‌గా రాబోతున్నారు. ప్రధాని మోదీ ఆయన్ని జైపూర్‌లో రిసీవ్ చేసుకుని ఢిల్లీ వరకు తీసుకురానున్నారు. 2023 జులైలో ప్యారిస్‌లో జరిగిన బాస్టిల్ డే పరేడ్‌కు మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సమయంలో ఫ్రాన్స్ అధ్యక్షుడిని భారత్‌కు ఆహ్వానించడం.. దానికి ఆయన అంగీకరించడం అన్ని చకచక జరిగిపోయాయి.

# ఫస్ట్ ప్రయారిటీ 'రైతుబంధు'

## ఆర్థికశాఖకు రేవంత్‌రెడ్డి ఆదేశాలు




హైదరాబాద్ : యాసంగి పంటకాలానికి సంబంధించి పెట్టుబడి సాయం చెల్లింపులు జాప్యం అవుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థికశాఖకు కీలక ఆదేశాలు జారీచేశారు. ఇతర శాఖలకు సంబంధించిన పనులు, కాంట్రాక్టర్లకు చెల్లింపులు ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టి.. రైతుబంధు చెల్లింపులకే మొదటి ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. ఐదెకరాల వరకూ రైతుబంధు చెల్లింపులు పూర్తయ్యేదాకా ఇతర చెల్లింపులు నిలిపివేయాలని సీఎం చెప్పిన నేపథ్యంలో నగదు బదిలీ ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశాలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 69 లక్షల మంది పట్టాదారులు ఉండగా.. వారికి ఎకరానికి రూ.5 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించేందుకు ఒక సీజన్‌కు రూ.7,625 కోట్లు అవసరమవుతున్నాయి. ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుబంధు చెల్లింపులను రాష్ట్ర సర్కారు డిసెంబరులో ప్రారంభించింది. తొలుత ఎకరం వరకు భూమి ఉన్న రైతులకు నగదు బదిలీ చేయాలని, ఆ తర్వాత క్రమంగా విస్తీర్ణం పెంచుకుంటూ.. నిధులు సర్దుబాటు చేసుకుంటూ చెల్లింపులు చేయాలని సీఎం ఆదేశించారు. కానీ, నిధుల కొరతతో ఇబ్బందులు ఎదురయ్యాయి. తాజాగా రిజర్వు బ్యాంక్ నుంచి 3వేల కోట్ల రుణం తీసుకోవడంతో చెల్లింపులు మళ్లీ మొదలయ్యాయి. ఇతర చెల్లింపులను ఆపి రైతుబంధుకే సొమ్ములు కేటాయించాలన్న సీఎం ఆదేశాలతో చెల్లింపుల్లో వేగం పెరిగింది. ఈ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకూ 49 లక్షల ఎకరాలకుగాను 46 లక్షల మంది రైతులఖాతాల్లో రూ.2,450 కోట్లు జమ చేశారు. ఇంకా 23 లక్షల మంది రైతులకు రూ.4,170 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం 2- 3 ఎకరాల కేటగిరీలో ఉన్న రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయి. రాష్ట్రంలో

## ఇతర బిల్లుల చెల్లింపులను ప్రస్తుతానికి ఆపండి

సన్నకారు రైతులు(3 ఎకరాల దాకా భూమి ఉన్నవారు) సుమారు 48 లక్షల మంది ఉన్నారు. వారిలో 46 లక్షల మందికి చెల్లింపులు పూర్తయ్యాయి. మరో 2 లక్షల మందికి నగదు బదిలీచేస్తే.. 3 ఎకరాల వరకూ చెల్లింపులు దాదాపుగా పూర్తవుతాయి. ఆ తర్వాత నాలుగెకరాలు, ఐదెకరాల వరకూ కూడా చెల్లింపులు పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఐదెకరాలకు మించి విస్తీర్ణం ఉన్న రైతులకు ఫిబ్రవరిలో చెల్లింపులు చేసే చాన్స్ ఉంది. ఉద్యోగుల వేతనాలు చెల్లించిన తర్వాత నిధులు సర్దుబాటు చేసుకొని మిగిలిన రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించనున్నారు. ఫిబ్రవరిలో రైతుబంధు చెల్లింపులు మొత్తానికి మొత్తం పూర్తిచేసే అవకాశాలున్నాయి. కాగా.. ఎకరం, రెండెకరాలలోపు పొలం ఉన్న రైతుల్లో కొందరికి రైతుబంధు పడలేదనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అధికారులు వాటిపై దృష్టి సారించారు.

## లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నాం: వికాస్‌రాజ్



హైదరాబాద్: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు సీఈఓ వికాస్‌రాజ్. ఫిబ్రవరి ఎనిమిదో తేదీన ఫైనల్ లిస్ట్ ప్రకటించనున్నట్టు స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఓటు హక్కు వినియోగించుకోవడం మన అందరి బాధ్యత అని కామెంట్స్ చేశారు. కాగా, ఈరోజు హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా సెలబ్రేషన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఈవో వికాస్‌రాజ్, రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారధి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ విచ్చేశారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నాం. ఫిబ్రవరి ఎనిమిదో తేదీన ఫైనల్ లిస్ట్ ప్రకటిస్తాం. జనరల్ ఎలక్షన్స్ ప్రశాంతంగా జరిపాం. మొదటిసారి హోం ఓటింగ్ విజయవంతంగా నిర్వహించాం. ఓటు హక్కును వినియోగించుకోవడం మనందరి బాధ్యత. తొమ్మిది లక్షల ఓటర్స్‌ను కొత్తగా నమోదు చేసినట్టు తెలిపారు.




కోల్‌కతా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొనసాగిస్తున్న 'భారత్ జోడో న్యాయయాత్ర' గురువారం అస్సాం నుంచి పశ్చిమబెంగాల్‌లోకి ప్రవేశించింది. అయితే, చివరి నిమిషంలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముందుగా ప్రతిపాదించినట్లు కాకుండా ఉత్తరాది జిల్లాల మీదుగా యాత్రను త్వరగా ముగించి బిహార్ రాష్ట్రంలోకి వెళ్లేలా మార్గాన్ని మార్చారు. వారం రోజుల్లోగా 'న్యాయయాత్ర' మళ్లీ బెంగాల్‌లోకి ప్రవేశిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. పార్టీకి మంచి పట్టున్న మాల్దా, ముర్షిదాబాద్ నియోజకవర్గాల్లో తరువాత యాత్ర కొనసాగుతుందని సమాచారం. సీపీఐ(ఎం)తో పాటు ఇండియా కూటమిలోను భాగస్వాములుగా ఉన్న ఇతర పార్టీల నేతలు ఈ యాత్రలో పాల్గొన్నారు. కానీ, తృణమూల్ నాయకులు మాత్రం ఎక్కడా కనిపించలేదు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ ఒంటరిగానే పోటీ చేస్తుందని బుధవారం ఆ పార్టీ అధ్యక్షురాలు, సీఎం మమతా బెనర్జీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే న్యాయయాత్ర మార్గంలో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. సీట్ల సర్దుబాటుపై తాను ఒక ప్రతిపాదన చేశానని, కాంగ్రెస్ దానిని తోసిపుచ్చిందని, దీంతో సొంతంగానే పోటీకి దిగాలని నిర్ణయించుకున్నామని మమత మీడియాకు వెల్లడించారు. సీట్లపై రెండు పార్టీల మధ్య చర్చలు జరుగుతున్నాయన్న వార్తల్ని తోసిపుచ్చారు. ఈ అంశంపై కాంగ్రెస్‌లో ఏ ఒక్కరితోనూ తాను మాట్లాడలేదని స్పష్టంచేశారు. ఇకపై రాష్ట్రంలో ఆ పార్టీతో ఎలాంటి సంబంధం ఉండబోదన్నారు.

జాతీయస్థాయిలో సంబంధాల పైనా పునరాలోచిస్తానని తెలిపారు. విపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి భాజపాను ఎదుర్కోవాలని ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌ను దీదీ వ్యాఖ్యలు తీవ్ర ఒత్తిడిలోకి నెట్టేశాయి. ఆమ్‌ఆద్మీ కూడా పంజాబ్‌లో మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లో బరిలోకి దిగుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ వెల్లడించారు. పంజాబ్ సహా హరియాణా, దిల్లీ, గోవా, గుజరాత్‌లలో సీట్ల సర్దుబాటుపై చర్చల్లో ప్రతిష్టంభన వేళ ఆయన ఈ ప్రకటన చేశారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీతోనూ కాంగ్రెస్‌కు సరిగా పొసగడం లేదు. మహారాష్ట్రలో సీట్ల సర్దుబాటుపై ఆ రెండు పార్టీల మధ్య నెలకొన్న అనిశ్చితి ఇంకా తొలగిపోలేదు.

**ఇండియా కూటమి పోరాటం కొనసాగుతుంది:** సార్వత్రిక ఎన్నికల్లో భాజపా ఓటమి లక్ష్యంగా ఏర్పడిన 'ఇండియా' కూటమికి ప్రతిపక్ష పార్టీ నేతలు షాకిస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు పంజాబ్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని ఆ రాష్ట్ర సీఎం భగవంత్ మాన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశంలో జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా కూటమి తమ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

## కేటీఆర్ బుద్ధిగా పనిచేయ్.. మంత్రి సీతక్క హితవు



రాజన్న సిరిసిల్ల, జనవరి 25: అధికార పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ప్రభుత్వ పాలనను వ్యతిరేకిస్తూ కేటీఆర్ అనేక సార్లు సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. అలాగే మంత్రులు కూడా కేటీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టే పనిలో పడ్డారు. తాజాగా కేటీఆర్‌పై మంత్రి సీతక్క విరుచుకుపడ్డారు. ఇకపై బుద్ధిగా పనిచేసుకోవాలంటూ కేటీఆర్‌కు హితవుపలికారు. గురువారం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని మంత్రి సీతక్క దర్శించుకున్నారు. దర్శనానంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌పై ఫైర్ అయ్యారు. కేటీఆర్‌కు మైండ్ పని చేయడం లేదని విమర్శించారు. విధ్వంస రాజకీయాలకు కేటీఆర్ పాల్పడుతున్నారన్నారు. అధికారం లేకుండా ఎమ్మెల్యే ఉండలేకపోతున్నారని దుయ్యబట్టారు. "మీ అహంకారమే మీ ఓటమికి కారణం" అని అన్నారు. కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచినా ప్రమాణ స్వీకారం చేయడం లేదన్నారు. తమపై మాట్లాడే ముందు కేటీఆర్‌కు బుద్ధి మైండ్ ఉండాలా అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌కు నీచపు కుళ్ళు రాజకీయాలు ఎందుకు అని ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు గమనిస్తారన్నారు.

తాము సక్రమంగా పని చేస్తేనే మళ్ళీ అధికారం ఇస్తారని.. చేయకపోతే అవకాశం ఇవ్వరన్నారు. కేటీఆర్ బుద్ధిగా ప్రతిపక్ష హోదాలో పని చెయ్ అంటూ మంత్రి సీతక్క హితవుపలికారు.

## ఎంపీగా పోటీపై కేటీఆర్ ఫుల్ క్లారిటీ.. కేసీఆర్ సంగతేంటో..?

హైదరాబాద్ : తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓ వార్త హల్‌చల్ చేస్తోంది. ఎంపీలుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు పోటీ చేస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. బావాబామ్మర్దులు ఇద్దరూ పార్లమెంట్‌లో అడుగు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారనే వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్



ప్రెసిడెంట్ కేటీఆర్ క్లారిటీ ఇచ్చారు. అదంతా ఫేక్ అని.. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని కేటీఆర్ కొట్టిపారేశారు. తమకైతే ఎంపీగా పోటీ చేసే ఆసక్తి లేదని కుండబద్దలు కొట్టేశారు. దీంతో గత కొద్దిరోజులుగా కేటీఆర్, హరీష్‌రావులపై వస్తున్న వార్తలకు తెరపడినట్లైంది.

**కేసీఆర్ సంగతేంటో..? :** కాగా.. కేటీఆర్ మల్కాజిగిరి లేదా సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి.. హరీష్ రావు మెదక్ నుంచి పోటీ చేస్తారని వార్తలు గుప్పుమన్న సంగతి తెలిసిందే. అంతేకాదు.. కేసీఆర్ కూడా పోటీ చేస్తారని ప్రచారం కూడా సాగింది. అయితే.. హరీష్ రావు, తాను పోటీ చేయట్లేదని మాత్రమే కేటీఆర్ చెప్పారు కానీ.. కేసీఆర్ విషయంపై మాత్రం ఎందుకో క్లారిటీ ఇవ్వలేదు. దీంతో కేసీఆర్ పోటీ పక్కా అనే తెలుస్తోంది.




హైదరాబాద్: గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి తెలంగాణ జనసమితి అధినేత, ప్రొఫెసర్ కోదండరాం, సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు గవర్నర్ ఆమోదం తెలిపారు. కోదండరాంను ఎమ్మెల్సీగా ఎంపిక చేయాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే.

అలాగే మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు కోదండరాం మద్దతిచ్చారు. ఆయనకు ఇచ్చిన హామీ మేరకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. తెలంగాణ ఉద్యమంలో కోదండరాం కీలక పాత్ర పోషించారు. అందుకే ఆయన పేరును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించి గవర్నర్‌కు పంపించారు.

**నాడు.. నేడు..!** కాగా.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో దాసోజు శ్రవణ్, కుర్ర సత్యానారాయణను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రతిపాదించారు. అయితే గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ వీరిద్దరిని పెండింగ్‌లో పెట్టారు. వారిని ఏ ప్రాతిపదికన ఎమ్మెల్సీగా నామినేట్ చేశారో చెప్పాలని గవర్నర్ గత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

అనంతరం వారిద్దరి అభ్యర్థిత్వాన్ని పక్కన పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు కోదండరాం, మీర్ అమీర్ అలీఖాన్ పేర్లను అమోదించడంతో తమిళిసై మరోసారి చర్చానీయాంశం అయ్యారు.

## నేడు కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ మీటింగ్

### ఏం చర్చించబోతున్నారంటే..

హైదరాబాద్, జనవరి 25: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం రేపు (శుక్రవారం) ఉదయం 11 గంటలకు జరుగనుంది. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగనుంది. ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో జరుగనున్న ఈ



సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు హాజరుకానున్నారు. ఈ నెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై రేపటి సమావేశంలో ఎంపీలతో కేసీఆర్ చర్చించనున్నారు.

గరుడ వార్త



# సంపాదకీయం

## మోడీ సెంటిమెంట్ ఈ రేంజ్‌లో ఉంటుందని అస్సలు ఊహించలేదా.. రాహుల్ సర్!

సెంటిమెంట్ అంటే.. కేవలం కొన్ని నిమిషాలకో.. కొన్నిగంటలకో పరిమితం అవుతుందని అనుకుంటా రు. అంతేకాదు.. కొందరికే ఇది పరిమితం అవుతుంది. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నవారికి పెద్దగా సెంటిమెంట్లను పట్టించుకునే పరిస్థితి ఉండదు. కానీ, ఇప్పుడు ఈ వాదనలన్నీ కొట్టుకుపోయాయి. కరడు గట్టిన కమ్యూనిస్టుల నోటీ కూడా.. రామ నామం జపించేయగల భారీ సెంటిమెంటునే ప్రధాని నరేంద్ర మోడీ దేశంపై ఒక తారక మంత్రంగా విరజిమ్మారు. ఇది అలాంటి.. ఇలాంటి సెంటిమెంటు కాదు..! అనే రేంజ్‌లో ప్రధాని మోడీ.. అయోధ్య రామమందిర పునః ప్రతిష్టా కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. తాజాగా కేరళ నుంచి తమిళనాడు వరకు.. అటు ఈశాన్య రాష్ట్రాల నుంచి ఉత్తరాది వరకు.. ఎటు చూసినా రామ నామ జపమే వినిపిస్తోంది. నిజానికి కేరళలో స్థానికులు మెజారిటీగా వేరే మతాన్ని ఆచరిస్తారు. కానీ, ఇక్కడ కూడా ఇప్పుడు రామనామమే వినిపిస్తోంది. ప్రభుత్వం కూడా వారి డిమాండ్లకు తలొగ్గి.. సెలవు ప్రకటించింది. ఇక, పక్కా క్రిస్టియానిటీ ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లోనూ రామ భక్తి వెల్లువగా పారుతోంది. ఎంతగా అంటే.. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి సెగ పెట్టేంతగా!! ఆశ్చర్యం అనిపించినా నిజమే. ప్రస్తుతం రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రలో ఉన్నారు. ఇది అస్సాంలో సాగుతోంది. అయితే.. ఈయన యాత్ర.. సమీపంలోని ఓ మందిరానికి చేరుకున్నాక.. యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు.. ఆలయంలో రాముడిని దర్శించుకుని.. బీజేపీ కార్యకర్తలు చేస్తున్న భజనల్లో పాల్గొన్నారు అంతేకాదు.. బీజేపీ వారితో కలిసిపోయిన కాంగ్రెస్ కార్యకర్తలు.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు అందుకున్నారు. ఈ ఘటన్ రాహుల్‌ను విస్మయానికి గురిచేసింది. తన వారు కూడా మోడీ వలలో పడిపోయారే! అని గుసగుసలాడారు. సో.. ఇదీ.. మోడీ ఈ దేశ ప్రజలపై జల్లిన రాముడి సమ్మోహనాస్త్రం! ఇదిలావుంటే, అయోధ్య రామమందిర కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు.. బహిష్కరించిన విషయం తెలిసిందే. అయితే.. కేరళకు చెందిన ఇద్దరు కమ్యూనిస్టు కురువృద్ధులు మాత్రం ఆలయానికి వెళ్లనున్నట్టు వెల్లడించారు.

## జాతీయ భావం తొనకిసలాడేలా సెలబ్రిటీ క్లబ్‌లో ఫుడ్ ఫెస్టివల్ చైర్మన్ విజయసేన్ రెడ్డి ఆధ్వర్యంలో













శామీర్ పేట్ (గరుడ వార్త) : జాతీయ భావాన్ని నెలకొల్పేలా గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జాతీయ భావం ఉట్టిపడేలా శామీర్ పేట సెలబ్రిటీ రిసార్ట్ లో జాతీయ పతాక వర్ణముతో కూడిన ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని సెలెబ్రెటీ రిసార్ట్, ప్రజయ్ ఇంజనీరింగ్ వస్థాపక చైర్మన్ విజయ్ సేన్ రెడ్డి సెలబ్రిటీ క్లబ్ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ రెడ్డి పర్యవేక్షణలో జాతీయ జెండా రంగులో వంటకాలను చేపట్టి గణతంత్ర వేడుకల్లో భాగంగా వినియోగదారులకు అందించేందుకు శ్రీకారం చుట్టారు. జాతీయ పతాక రంగులతో కూడిన 20 రకాల ఆహార పదార్థాలను రూపొందించి డిష్ లను ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో ఒకరికి 1,650 రూపాయల విలువచేసే ఆహార పదార్థాలను జాతీయ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని 1,050 రూపాయలకే అందిస్తున్నట్లు సెలబ్రెటీ క్లబ్ మేనేజర్ హరి జోసఫ్ తెలిపారు. జాతీయ పతాక రంగులతో కూడిన కేకు, బిర్యానీ, ఫ్రైడ్ రైస్, ఇడ్లీ, బిస్కెట్స్, స్నాక్స్ లతో కూడిన ఆహార పదార్థాలను గణతంత్ర దినోత్సవ సందర్భంగా కాషాయం, తెలుపు ఆకుపచ్చని రంగులను కలిపి జాతీయ పతాకం భావన కలిగేలా వినియోదారులకు అందించనున్నట్లు ఆయన వివరించారు. ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రిసార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ రెడ్డి వివరించారు.

## అభివృద్ధి యే లక్ష్యం : ఎమ్మెల్యే మల్లారెడ్డి





శామీర్ పేట, (గరుడ వార్త) : నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం ముందుకు సాగుతానని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గురువారం మూడు చింతలపల్లి మండలంలోని వివిధ గ్రామా లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందానని, అవసరమైతే అభివృద్ధికి తన సొంత నిధులతో పనులు చేపడతానని చెప్పారు. అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి కృషి చేస్తానని తెలిపారు .

ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఉద్దె మర్రి నరసింహ రెడ్డి, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి, ఎంపీపీ హారిక మురళి గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాల నుండి నా ప్రతి ఒక్క యువతీ యువకులు ఓటర్గా నమోదు చేసుకోవాలి..

శామీర్ పేట, (గరుడ వార్త) : ఓటు హక్కు లేని యువతీ, యువకులు ఓటరుగా తప్పక నమోదు చేసుకోవాలని కమిషనర్ జైత్ రామ్ నాయక్ అన్నారు. గురువారం తుముకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జయతు రామ్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా అధికారులు సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అర్హత గల యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు పోకుండా నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ తోనే దేశం అభివృద్ధి..

### మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు..

తార్నాక : బీజేపీ తోనే దేశం అభివృద్ధి చెందుతుందని సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు అన్నారు. నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గ నూతన ఓటర్ల సమ్మేళనం బీజేవైఎం ఆధ్వర్యంలో తార్నాక నారాయణ కాలేజీలో గురువారం నిర్వహించారు. ఈ



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు హాజరై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అయిదు వేల ప్రదేశాల్లో నమో నవమత్ దాత సమ్మేళన్ నిర్వహిస్తున్నా రని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా మాట్లాడడం జరిగిందన్నారు. దేశంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమం రాబోయే తరాల కోసమే అని పేర్కొన్నారు. మొట్టమొదటి సారిగా వచ్చే ఓటు హక్కును యువత వినియోగించుకోని ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం నిత్యం నూతన చైతన్యంతో ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. ఓటు వేయడం ద్వారా దేశ భవిష్యత్తు ను మార్చే అవకా శం ఉంటుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేకల సారంగపాణి, అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వర్ రెడ్డి, ప్రభు గుప్తా బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాజు నేత, సికింద్రాబాద్ జిల్లా నాయకులు అయ్యప్ప రెడ్డి, భరత్, హర్షిత, శివాజీ, గంగా, ఉపేందర్ యాదవ్, లడ్డు, అరవింద్, శ్రీనాథ్, సాయి, శ్రీకాంత్, చరణ్, రోహిన్, ప్రభు, ఆశ తదితరులు పాల్గొన్నారు.

## రెండు పంట కాలువల నిర్వహణకు సిబ్బందిని కేటాయించండి కోరిన...

### అలియాబాద్ గ్రామ సర్పంచ్ గురక కుమార్.

శా మీర్ పేట (గరుడ వార్త) : పంట కాలువలు సరిగ్గా పారితేనే రైతు ధీమాగా పంటలు పండించగలడని అలియాబాద్ గ్రామ సర్పంచ్ గురుకు కుమార్ అన్నారు. అలియాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో గల రెండు పంట కాలువల నిర్వహణ కొరకు సిబ్బందిని కేటాయించాలని కోరుతూ షామీర్పేట్ మండల తాసిల్దార్ కు మండల కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా అలియాబాద్



గ్రామంలో గల రెండు పంట కాలువలు షామీర్పేట చెరువు నుండి మొదలై అలియాబాద్ గ్రామం మీదుగా జగ్గంగూడ గ్రామం వరకు పారుతున్నందున, అట్టి పంట కాల్వల పై ఎంత మంది రైతులు ఆధారపడి ఉన్నారన్న విషయాన్ని సైతం గ్రామ సర్పంచ్ గురక కుమార్ తహసిల్దార్ కు విన్నవించారు. ఇతర రైతులతో కూడి గ్రామ సర్పంచ్ కుమార్ తాసిల్దార్ కు వినతిపత్రం అందించారు.

## ఫ్రాన్స్ అధ్యక్షుడి స్వాగతానికి ఏర్పాట్లు పూర్తి

ఢిల్లీ: ప్రతి ఏడాదిలాగే ఈ గణతంత్ర దినోత్సవానికి ఢిల్లీలో జరిగే పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ముఖ్య అతిథి రాబోతున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు ప్రభుత్వం ఇప్పటికే ఆహ్వానం పంపింది. భారత 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన చీఫ్ గెస్ట్‌గా రాబోతున్నారు. ప్రధాని మోదీ ఆయన్ని జైపూర్‌లో రిసీవ్ చేసుకుని ఢిల్లీ వరకు తీసుకురానున్నారు. 2023 జులైలో ప్యారిస్‌లో జరిగిన బాస్టిల్ డే పరేడ్‌కు మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సమయంలో ఫ్రాన్స్ అధ్యక్షుడిని భారత్‌కు ఆహ్వానించడం.. దానికి ఆయన అంగీకరించడం అన్ని చకచక జరిగిపోయాయి.

# పాలిథిన్ నిషేధం ఎక్కడ?

భువనగిరి : పర్యావరణానికి తీవ్ర ముప్పు తెచ్చిపెడ్తున్న పాలిథిన్ ప్రస్తుతం నిత్య జీవితంలో భాగమైంది. 120 మైక్రాన్ల మందం లోపు ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల వినియోగం విచ్చలవిడిగా కొనసాగుతుండటంతో పర్యావరణ పాలిట పెనుభూతంగా మారింది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పూర్తిస్థాయిలో నిషేధం అమలుకు నోచుకోలేదు.

పరిస్థితి ఇలా... ఉమ్మడి జిల్లా పరిధిలోని అత్యధిక పురపాలికల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదు. హానికారక ప్లాస్టిక్ చెత్తతో పాటు యార్డుకు చేరుతుంది. తనిఖీల పేరిట అడపాదడపా స్థానిక సంస్థల అధికారులు హడావుడి చేయడం, జరిమానాలు విధించి వదిలేయడంతో నిషేధం అమలు పూర్తిస్థాయిలో కొనసాగడంలేదు. ప్రజలను చైతన్య పర్చే కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఫలితాలు రావడం లేదు. కాగితం, నారతో తయారు చేసిన సంచుల వినియోగం పెరగాల్సి ఉంది. ఇటువంటి వస్తువులు తయారు చేస్తున్న యూనిట్లను అధికారులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

ప్లాస్టిక్‌తో ప్రమాదం



డాక్టర్ రఘుపతిరెడ్డి, వైద్యుడు

ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం ఇది ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఆహార పదార్థాల తరలింపులో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ఈ ప్రక్రియతో ప్రమాదకర ప్లాస్టిక్ రసాయనాలు మన శరీరంలో చేరితే అది దీర్ఘకాలంలో క్యాన్సర్‌కు దారితీసే అవకాశం ఉంది. నాడీ వ్యవస్థను దెబ్బతీసే అవకాశం ఉంది. గుండె జబ్బులు, కాలేయ, మూత్రపిండాల వ్యాధులకు కారణమవుతాయి. వేడి ఆహారాన్ని కవర్లు, గ్లాసుల్లో తీసుకోవద్దు. అన్ని తెలిసినప్పటికీ వినియోగిస్తూ ప్రజలు తమ ఆరోగ్యాన్ని దెబ్బతీసుకుంటున్నారు.

# పట్టించుకోకుంటే పక్కదారే..!

కోదాడ : ఓ వినియోగదారుడు కోదాడ పట్టణంలోని రేషన్ దుకాణానికి వెళ్లారు. బియ్యం బదులు నిత్యావసర వస్తువులు తీసుకోమని సూచించారు. సబ్బులు, పంచదార, ఇతర వస్తువులు ఇవ్వడంతో సదరు వినియోగదారుడు తీసుకున్నాడు. ఇలా చాలా మంది డీలర్లు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. మునగాల మండలంలోని ఓ రేషన్ వినియోగదారుడి ఇంట్లో ఐదుగురు సభ్యులు ఉండగా.. ఓ గ్రామంలోని రేషన్ డీలర్.. 30 కిలోల బియ్యం బదులు రూ.180లకు పైగా నగదు ఇస్తున్నాడు. ఇలా చాలా మంది డీలర్లు డబ్బులు, నిత్యావసర సరకులు ఇస్తుండటం విశేషం.

పేదలకు బియ్యం పంపిణీ చేసే రేషన్ దుకాణాల్లో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది వినియోగదారులు బియ్యం తీసుకోకపోయినా తీసుకున్నట్లు వారి వివరాలు నమోదు చేసి, వారి పేరిట వచ్చిన బియ్యాన్ని పక్కదోవ పట్టిస్తున్నారు. వినియోగదారుడి చేతి వేలి ముద్ర తీసుకొని వారికి రేషన్ బియ్యం ఇవ్వకుండా నిత్యావసర వస్తువులు ఇస్తూ, రేషన్ దుకాణాన్ని నిత్యావసర దుకాణంగా మారుస్తున్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పౌరసరఫరాల మంత్రిగా ఉండటంతో పలు మార్లు బియ్యం దందాపై హెచ్చరికలు జారీ చేశారు.

బియ్యం వ్యాపారులతో కుమ్మక్కు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది లక్షల మందికి పైగా వినియోగదారులు నిత్యం రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. ప్రజలు సన్న బియ్యం తింటుండటం, ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండటంతో చాలా మంది వాటిని తినడానికి ఇష్టపడటం లేదు. రేషన్ దుకాణాల్లో విక్రయించి వాటి బదులు డబ్బులు, నిత్యావసర వస్తువులు తీసుకుంటున్నారు. దీంతో డీలర్లు పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. వినియోగదారుడికి కిలో బియ్యం పేరిట రూ.6లు చెల్లించి, రూ.10లకు పైగా విక్రయిస్తూ డబ్బు సంపాదిస్తున్నారు.

వేలిముద్రల నిబంధన ప్రవేశపెట్టినా..

రేషన్ దుకాణంలో జరిగే అవకతవకలను అరికట్టేందుకు ప్రభుత్వం రేషన్ కార్డుదారుల్లో ఒకరు వేలి ముద్ర వేసే నిబంధన తీసుకొచ్చింది.



ఉదాహరణకు ఒక ఇంట్లో అయిదుగురు సభ్యులుంటే 30 కిలోల బియ్యం తూకం వేయాల్సి ఉంటుంది. కచ్చితంగా 30 కిలోల బియ్యం తూకం వేసినప్పుడే, వినియోగదారుడు వేసిన వేలిముద్రలు ఆ యంత్రం తీసుకుంటుంది. అనంతరం ఆ బియ్యాన్ని రేషన్ డీలర్లు తమ వద్దే ఉంచుకొని బదులు ఇతర వస్తువులను వినియోగదారులకు ఇస్తున్నారు.

ఇతర వస్తువులు పంపిణీ చేస్తే కఠిన చర్యలు

మోహన్‌బాబు, డీఎస్వో, సూర్యాపేట

కొందరు రేషన్ డీలర్లు బియ్యం బదులు డబ్బులు, నిత్యావసర వస్తువులు ఇస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తాం. ఇతర వస్తువులు పంపిణీ చేసే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే సదరు డీలర్ లైసెన్స్ రద్దు చేస్తాం. వినియోగదారులు నేరుగా మా దృష్టికి తీసుకురండి.

# ఆగిన మగ్గం.. తెగిన ఆధారం



కరీంనగర్ : ఆరేళ్లుగా బతుకమ్మ చీరల తయారీతో చేనేత కార్మికులు, యజమానులు ఏడాది పొడవునా ఉపాధి పొందుతున్నారు. 6 నుంచి 9 నెలలపాటు బతుకమ్మ చీరలు తయారు చేస్తుండగా మిగతా సమయంలో తువ్వాలలు, లుంగీలు, కాటన్ చీరలు, ఇతరత్రా దుస్తుల తయారీతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. గతేడాది తయారు చేసిన బతుకమ్మ చీరలకు సంబంధించిన బిల్లులు ఇప్పటికీ మంజూరు కాకపోవడంతో మరమగ్గాల యజమానులు దుస్తుల తయారీ పనులు నిలిపివేశారు. మరమగ్గం ఆగిపోగా చేనేత కార్మికులు ఆ'ధారం' కోల్పోయారు. మరో పని అలవాటు లేని చేనేత కార్మికులు అరకొర పనులతో జీవనం సాగిస్తున్నారు. గతంలో రోజుకు రూ.800 నుంచి రూ.1000 వరకు సంపాదించే కార్మికుడు నేడు పనుల్లేక కేవలం రూ.200 మాత్రమే సంపాదిస్తున్నాడు. రాజన్న సిరిసిల్ల తర్వాత కరీంనగర్ జిల్లాలో గంగాధర మండలం గర్శకుర్తి, చొప్పదండి, కొత్తపల్లి గ్రామాల్లో వందలాది కుటుంబాలు మరమగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.

బకాయిలతో తప్పని తిప్పలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 985 యూనిట్లకుగాను 3115 మరమగ్గాలపై కార్మికులు వస్త్రాలు తయారు చేస్తున్నారు. గతేడాది 32 లక్షల మీటర్ల బతుకమ్మ చీరల తయారీకి అవకాశం కల్పించారు. ఒక్క గర్శకుర్తిలోనే 36 యూనిట్లకు 1400 మగ్గాలపై తయారు చేసిన చీరలను ప్రభుత్వానికి అందించగా రాష్ట్రంలోని మహిళలకు పంపిణీ చేశారు. విడతల వారీగా చేనేత కార్మికులకు 36 శాతం నిధులు మాత్రమే విడుదల చేశారు. మూడు జిల్లాల పరిదిలో ఇంకా రూ.8 కోట్ల బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. ముడిసరకు కొనుగోలు చేసిన చోట, చీరలు తయారు చేసిన కార్మికులకు డబ్బులు చెల్లించలేక యజమానులు మరమగ్గాలు ఆపివేశారు. కార్మికులకు పనులు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర అగచాట్లు పడుతున్నారు. ఈ ఏడాదికిగాను బతుకమ్మ చీరల తయారీకి జనవరి నెలలోనే ఆర్డర్ రావాల్సి ఉండగా ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో ఆందోళనకు గురవుతున్నాయి. గత నెలలో ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారిపోవడంతో కొంత జాప్యం జరుగుతోందని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. పెండింగు బిల్లులు చెల్లించి బతుకమ్మ చీరల ఉత్పత్తి ప్రక్రియ యథావిధిగా కొనసాగించాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

రూ.16 లక్షలు చెల్లించాల్సి ఉంది

ముడిసరకు తెచ్చిన చోట రూ.12 లక్షలు, చీరలు ఉత్పత్తి చేసిన కార్మికులకు రూ.4 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే అప్పు చేసి తయారు చేసిన వస్త్రోత్పత్తికి ప్రభుత్వం నుంచి బిల్లులు అందాల్సి ఉంది. వెంటనే ప్రభుత్వం బిల్లులు చెల్లించి మరోసారి బతుకమ్మ చీరల తయారీకి అవకాశం కల్పించాలి. లేకపోతే ఉపాధి కోల్పోతాం.

అలువాల విఠోభ, మరమగ్గాల యజమాని

బ్బందులు పడుతున్నాంమూడు నెలలుగా మరమగ్గాల పనులు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బతుకమ్మ చీరల తయారీతో ఏడాదిలో 8 నెలలపాటు పనులు లభించేవి. మిగతా సమయంలో తువ్వాలలు, కాటన్ చీరలు, లుంగీలు, ఇతర పనులతో రోజుకు రూ.వెయ్యి లభించేది. ఇప్పుడు రూ.200 కూడా లభించడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది.

గడ్డం నారాయణ, కార్మిక సంఘం అధ్యక్షుడు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాంబతుకమ్మ చీరల తయారీకి సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. 36 శాతం నిధులు విడుదల చేశారు. ప్రభుత్వ విధి విధానాల తర్వాత కొత్తగా బతుకమ్మ చీరల ఉత్పత్తికి అవకాశముంది. మరమగ్గాల యజమానులు, కార్మికులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.

చరణ్, కరీంనగర్ చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు

# అందని పోషకాలు.. ఎదుగుదలలో లోపాలు



కరీంనగర్ : పిల్లల పోషణ, ఆరోగ్య స్థాయిలను మెరుగు పరచడమే కాకుండా పోషకాహార లోపాలు లేకుండా చూసేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నప్పటికీ.. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు సరైన పోషకాహారం అందక పిల్లలు సరైన బరువు లేకపోవడంతో ఎదుగుదల లోపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1065 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఆయా కేంద్రాలలో 14,642 గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు 34,881, ఆరేళ్లలోపు పిల్లలు 15,005 ఉన్నారు. ఇందులో అతితీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న వారు 268 మంది, తక్కువ పోషకాహారంతో బాధపడుతున్న చిన్నారులు 1,657 మంది ఉన్నారు. మిగతా 55,450 మంది సాదారణ స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మీ పథకం కింద 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల పప్పు, 16 గ్రాముల నూనె, 200 మి.లీ. పాలు, గుడ్డుతో భోజనం అందిస్తారు. 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు 75 గ్రాముల బియ్యం, 5 గ్రాముల నూనె, గుడ్డుతో భోజనం, మూడేళ్లలోపు చిన్నారులకు నెలలో 16 కోడిగుడ్లు, 2.5 కేజీ బాలమృతం రెండు విడతలుగా అందిస్తున్నారు.

గుర్తిస్తారిలా..పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు మూడు రకాలుగా విభజించారు. ఇందులో అతి తీవ్ర లోప పోషణ(ఎరుపు), తక్కువ తీవ్ర లోప పోషణ(పసుపు), సాధారణ(ఆకుపచ్చ)గా తీసుకుంటారు. నెలవారీగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు వయసు ఆధారంగా ఎత్తు, బరువు కొలతలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎదుగుదల లోపించిన వారిని గుర్తించి 'ఆకలి టెస్టు' నిర్వహిస్తారు. ఇంటి వద్ద ఏమీతినకుండా అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకువచ్చి బాలమృతం కలిపి ఇస్తే.. ఇంటిదగ్గర తల్లిదండ్రులు సరిగా చూసుకోకపోవడం లోపంగా, కొంచెం తిన్నట్లయితే తినిపిస్తే సరిపోతుందని, అసలే తినకుండా ఉంటే డేంజర్‌గా ఉన్నట్లు గుర్తించి అస్పత్రికి తీసుకెళ్లాలని సూచిస్తారు. కేవలం తల్లిదండ్రులు ఆహారం తీసుకునే విధానంపై జాగ్రత్తంగా చూసుకుంటే అధిక శాతం పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులకు అవగాహన


ఎదుగుదల లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రత్యేకంగా అదనపు పోషకాహారం అందిస్తున్నాం. అంతేకాకుండా ప్రతినెల ఎత్తు, బరువు ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షించేలా చూస్తున్నాం. అయినప్పటికీ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు లోపాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. దీనివల్ల జిల్లాలో తీవ్ర పోషణ లోపంతో బాధపడుతున్న చిన్నారులు తక్కువగా ఉన్నారు.

లత, పర్యవేక్షకులు, ఐసీడీఎస్

# పరీక్షల సమయం.. అవుదాం సన్నద్ధం

మిర్యాలగూడ : ఇంటర్ పరీక్షలను ఫిబ్రవరి 28 నుంచి నిర్వహించాలని బోర్డు అధికారులు ప్రకటించటంతో.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపుపై ఉమ్మడి జిల్లా విద్యాధికారులు దృష్టిసారించారు. అందులో భాగంగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. గతేడాది కంటే ఎక్కువ ఉత్తీర్ణత శాతం పెంపునకు జిల్లాలోని ఇంటర్ పర్యవేక్షణ అధికారులు ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌తో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నారు. డిసెంబరు చివరి నాటికి అన్ని ప్రభుత్వ కళాశాలల్లో పాఠ్యాంశాల బోధన పూర్తి చేసిన అధ్యాపకులు విద్యార్థులు పునఃచ్ఛరణ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం సాయంత్రం 4 గంటలకు కళాశాల సమయం పూర్తయిన తరువాత గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల్లో ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. వారానికి ఒకసారి ఆయా సబ్జెక్టుల వారీగా పరీక్షలు పెట్టి పట్టు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ఇంటర్ తరువాత ఎంసెట్, నీట్ పరీక్షలు రాసేందుకు గాను అవగాహన కల్పిస్తున్నారు.పాఠ్యాంశాల వారీగా అనుమానాల నివృత్తి

నల్గొండ జిల్లాలోని ఆయా కళాశాలల్లో 14,656 మంది ప్రథమ, 17,286 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రత్యేక తరగతుల బోధన సాగుతోంది. పాఠ్యాంశాల వారీగా అనుమానాలు నివృత్తి చేస్తున్నారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఎక్కువ సమయం లేదు. దీంతో ఉన్న సమయాన్ని అన్ని సబ్జెక్టులకు సద్వినియోగం చేసుకోనేలా



అధ్యాపకులు ఏర్పాటు చేస్తున్నారు.

ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు 15 వరకు నిర్వహించేందుకు ఇప్పటికే సన్నాహాలు చేస్తున్నారు. దీనికి గాను ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన ప్రయోగాలు సాధన చేయించారు.

ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు.విద్యార్థుల వ్యక్తిగత పర్యవేక్షణ సాగిస్తున్నాం– దస్రూనాయక్, జిల్లా ఇంటర్ పర్యవేక్షణాధికారిడిసెంబరు మొదటి వారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. అధ్యాపకులు విద్యార్థుల వారీగా వ్యక్తిగతంగా పర్యవేక్షించేలా ఏర్పాటు చేశాం. అన్ని సబ్జెక్టుల్లో వందశాతం ఫలితాలు సాధించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం.

# పాలిటెక్నిక్‌లో చేరేందుకు బ్రిడ్జి కోర్సు

నల్గొండ : ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు తీవ్ర పోటీ నెలకొంది. డిగ్రీలు చదివినా.. చిన్నపాటి కొలువు దొరక్క ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసుకున్న వారికి మాత్రం ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రాధాన్యమున్న పాలిటెక్నిక్ కోర్సులో నేరుగా చేరేందుకు ఐటీఐ పూర్తిచేసిన వారికి ప్రభుత్వం వీలు కల్పించింది. ఇందుకు బ్రిడ్జి కోర్సు చదివేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన యువత పాలిటెక్నిక్ కోర్సు రెండో సంవత్సరంలో చేరవచ్చు. ప్రస్తుతం బ్రిడ్జి కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది.

దరఖాస్తు.. పరీక్ష ఇలా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 29 ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐలు నల్గొండలో నాలుగు, యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండు చొప్పున ఉండగా.. 23 ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 11,561 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రాష్ట్రంలో పది ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో బ్రిడ్జి కోర్సు కేంద్రాలు నెలకొల్పారు. ఉమ్మడి జిల్లాలో నల్గొండ బాలికల ఐటీఐ కళాశాలలో కేంద్రం ఉంది. పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణత ధ్రువపత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 31 వరకు నల్గొండలో దరఖాస్తు చేసుకోవాలి. థియరీ,



ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. తర్వాత ఎల్పీసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా 2024–25 విద్యా సంవత్సరానికి గాను పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు.

ఉద్యోగ అవకాశాలు..

పాలిటెక్నిక్ విద్యార్థులకు వారు ఎంచుకున్న విభాగం ఆధారంగా ఉద్యోగావకాశాలు దక్కుతాయి. ఐటీఐ పూర్తి చేసిన వారిని ఆపరేటర్లుగా, పాలిటెక్నిక్ కోర్సు చేసిన వారికి సూపర్‌వైజర్లుగా కొలువులు దక్కుతాయి. వేతనాలు కూడా ఎక్కువే ఉంటాయి. నీటి పారుదల, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, రోడ్లు, భవనాల శాఖ, ఆర్టీసీ, జెన్‌కోతో పాటు పలు సంస్థల్లో ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది.

వయస్సుతో నిమిత్తం లేదుగోపాల్‌నాయక్, ప్రిన్సిపల్, బాలికల ఐటీఐ ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తిచేసుకున్న వారంతా పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న బ్రిడ్జి కోర్సును సద్వినియోగం చేసుకోవాలి. వయస్సుతో నిమిత్తం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలి.

# వనాలు మాయం.. ప్రాణులు ఆగం

యాదగిరిగుట్ట : యాదాద్రీశుడు కొలువైన కొండల్లో, పరిసర గ్రామాల్లో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వనాలు మాయమై.. రియల్ వెంచర్లు వెలుస్తుండటంతో తినేందుకు మేత, తాగేందుకు నీరు దొరక్క అవి జనావాసాల వైపు వచ్చి మృత్యువాత పడుతున్నాయి. యాదగిరిగుట్ట, దాని చుట్టు పక్కల ప్రాంతాలు ఒకప్పుడు పచ్చని కొండలు, గుట్టలతో అరణ్యాలను తలపించేవి. అడవి పందులు, కుందేళ్లు, నెమళ్లు, పక్షులు, మరెన్నో అరుదైన జంతు జీవాలకు ఆవాసంగా ఉండేది. రియల్ ఎస్టేట్ పుణ్యమా అంటూ ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆ కొండలు, గుట్టలు, పంట పొలాలు మాయమై వేల ఎకరాల్లో వెంచర్లు పుట్టుకొచ్చాయి. యాదగిరిగుట్ట మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సరైన అటవీ ప్రాంతం లేకపోవడంతో మిగిలి ఉన్న కొద్ది పాటి జంతువులు, పక్షులు నివాస ప్రాంతాల వైపు వస్తున్నాయి. గతంలో యాదాద్రి కొండ పైకి అడవిపంది వచ్చి భక్తులను భయభ్రాంతులకు గురిచేసింది. సంరక్షించే చర్యలు చేపట్టకపోవడంతో చివరికి భవనంపై నుంచి పడి మృతి చెందింది. తాజాగా పుష్కరిణి వద్ద కుక్కల దాడిలో నెమలి మృతి చెందిన విషయం తెలిసిందే. జంతువుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు అక్కడక్కడ ఏర్పాట్లు చేసినప్పటికి అవి ఆశించిన ఫలితాలు ఇవ్వలేదన్న వాదన స్థానికంగా వినిపిస్తోంది.



రెండు శాఖల మధ్య సమన్వయ లోపం

యాదాద్రి అభయారణ్యం పేరుతో భువనగిరి పరిధిలోని రాయగిరిలో కొంత అటవీ ప్రాంతాన్ని, అదేవిధంగా మల్లాపురం గ్రామంలో ఉన్న మరికొంత ప్రాంతంలో సంరక్షణ చర్యలు చేస్తున్నారు. వన్యప్రాణులు నివసించే చాలా ప్రాంతాలు రెవెన్యూ శాఖ ఆధీనంలో ఉండటం వల్ల వాటిని పరిరక్షించడంలో అటవీశాఖ వారికి పలు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇరు శాఖల సమన్వయంతో వన్యప్రాణులను, అటవీ సంపదను కాపాడి భావితరాలకు అందించాలని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

వేటాడితే కఠిన చర్యలు – సుచరిత, అటవీశాఖ రేంజ్ అధికారి

అంతరించిపోతున్న అటవీ, వన్యప్రాణుల సంరక్షణే మా ప్రథమ కర్తవ్యం. యాదగిరిగుట్ట రేంజ్‌లో అటవీ విస్తీర్ణం కేవలం 34.4 హెక్టార్ల మాత్రమే ఉంది. అది కూడా ఒక్క మల్లాపురం గ్రామంలోనే ఉండటంతో ఆ ప్రాంతంలో చుట్టూ కంచెవేసి సంరక్షిస్తున్నాం. ఆలయ నగరి, టెంపుల్ సిటీ పరిధిలో వన్యప్రాణులు సంచరిస్తున్నప్పటికి ఆ ప్రాంతం వైటీడీఏ పరిధిలో ఉండటంతో క్షేత్రస్థాయిలో సంరక్షణ చర్యలు చేపట్టలేకపోతున్నాం. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని జంతువులు, పక్షులను నీటి ఎద్దడి నుంచి కాపాడేందుకు మేమంతా సిద్ధమవుతున్నాం. వేటగాళ్ల వన్యప్రాణులను వేటాడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం–1972 ప్రకారం వారి పై కఠిన చర్యలు ఉంటాయని గుర్తుంచుకోవాలి.

# నాడు కొండల శివారు.. నేడు కబ్జాల జోరు

హైదరాబాద్ : గోపన్‌పల్లి విప్రో జంక్షన్ సమీపంలోనే సర్వేనంబరు 34 భూములున్నాయి. ఏళ్లుగా ఇవి ఖాళీగా ఉండడంతో రియల్ వ్యాపారుల కన్ను పడింది. అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండగా, కొందరు రియల్టర్లు రాత్రివేళ భూములను చదును చేయిస్తూ షెడ్లు ఏర్పాటుచేస్తూ వచ్చారు. రెండురోజుల కిందట జనాన్ని తీసుకువచ్చి గుడిసెలు వేయించేందుకు ప్రయత్నాలు చేశారు. రెవెన్యూ అధికారులు వారిని ఖాళీ చేయించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక అభివృద్ధి మండళ్లు.. ప్రజలకు సేవ చేసే సొసైటీలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పదిహేనేళ్ల కిందట కేటాయించిన భూములను కబ్జా చేసేందుకు కొందరు రియల్టర్లు ప్రయత్నాలు చేస్తున్నారు.. అప్పట్లో నగరానికి దూరంగా, కొండలు, గుట్టలతో ఉన్న 102 ఎకరాల భూమిని ప్రభుత్వ అధికారులు గోపన్‌పల్లిలోని సర్వే నంబరు 34లో ఆయా సంస్థలు, సొసైటీలకు కేటాయించారు. స్థలాలు తీసుకున్నవారు వాటిని ఉపయోగించుకోలేదు. ఐటీ కారిడార్‌గా ఆ ప్రాంతం మారిపోవడంతో భూముల విలువ పెరిగింది. కబ్జాదారులు వీటిని కబళించే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా రూ.వెయ్యి కోట్ల విలువైన భూములను ఆక్రమిం



చేందుకు యత్నించగా. రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. భూములపై బాధ్యత వారిదే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నంబరు 551 కింద గోపన్‌పల్లి పరిసర ప్రాంతాల్లో 102ఎకరాల భూములను 2008లో వేర్వేరు సంస్థలకు కేటాయించింది. రెవెన్యూ అధికారుల ఉత్తర్వుల మేరకు సర్వే చేయించుకుని కంచె నిర్మించుకోవాల్సిన బాధ్యత భూములు తీసుకున్నవారిదే. కొందరు ఖాళీగా వదిలేయగా.. మరికొందరు కంచెలు వేశారు. వేర్వేరు సంస్థలు, సొసైటీలకు ఇవ్వగా ఆ భూములతో సంబంధం లేదని రెవెన్యూ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. భూ యజమానుల్లో కొందరు ఇక్కడ లేకపోవడంతో మళ్లీ ఆక్రమణలు మొదలయ్యాయి.

# నిషేధం విధించినా సీసాల్లో ఆగని ఇంధన విక్రయాలు

హైదరాబాద్ : తహసీల్దార్ విజయారెడ్డి సజీవ దహనం, దిశపై అత్యాచారం ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించడం ఘటనల నేపథ్యంలో సీసాల్లో పెట్రోల్ అమ్మకాలపై ప్రభుత్వం నిషేధం విధించినా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తాజాగా మొయినాబాద్‌లో కాలుతున్న మహిళ మృతదేహం లభ్యమైన ఘటనలోనూ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుందని తేలింది. నేరాలు చేయడానికి లేదా సాక్ష్యాలను చెరిపేయడానికి నేరగాళ్లు ఈ పంథా ఎంచుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో బాహాటంగా బాటిళ్లలో పెట్రోల్ అమ్మకాలు సాగుతుంటే నగరంలో కొన్నిబంకుల్లోనూ ఇలా విక్రయిస్తున్నారు.

అగ్ని ప్రమాదాలకు ఆస్కారం...బంకుల్లో కాకుండా బయట పెట్రోలు విక్రయిస్తున్న చోట అగ్ని ప్రమాదాలకు అవకాశం ఉంటుంది. బోరబండ ఫేజ్-3 కాలనీలో ఇలా ప్రైవేటుగా విక్రయిస్తున్న చోట గతేడాది ఏప్రిల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో షెడ్ పక్కనే ఉన్న రెండు కార్లు, ఓ ద్విచక్ర వాహనం దగ్ధమయ్యాయి. ఫయాజ్ అనే వ్యక్తి ఎన్‌ఆర్‌పురం ఫేజ్-3లో అక్రమంగా పెట్రోల్, డీజిల్ విక్రయించేవాడు. ఆ రోజున మధ్యాహ్నం క్యాన్లను పెడుతున్న సమయంలో పక్కనే చెత్తకుప్పకు నిప్పు పెట్టడం, అక్కడి నిప్పు రవ్వ పడి క్యాన్ పేలిపోయింది. అదృష్టవశాత్తు ఆ ఘటనలో ఆస్తి నష్టం మినహా ఎవరికీ ఏమీ కాలేదు. ఈ ఘటనలో ఫయాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ఫోన్ నంబర్, వివరాలు చెబితేనే..

బంకుల మధ్య దూరాన్ని ఆసరాగా చేసుకొని ముఖ్య కూడళ్లలోని వాహనాల మెకానిక్, గాలి నింపే దుకాణాల్లో పెట్రోల్‌ను బాటిళ్లలో విక్రయిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో టేబుళ్లపై నిండు బాటిళ్లు ఉంచి అమ్ముతున్నారు. వీరికి బంకుల నిర్వాహకులు పెద్ద డబ్బాల్లో పట్టి పంపిస్తుండటం గమనార్హం. ప్రయాణంలో ఇంధనం అయిపోతే దారిలో వాహనాలు నిలిచిపోయే పరిస్థితిలో సీసాలు పట్టుకొని బంకులో పెట్రోల్ తెచ్చుకునేవారు. ప్రస్తుతం అలా తీసుకెళ్లాలంటే బంకులో తప్పనిసరిగా ఫోన్ నంబర్, వాహనం నంబరు ఇవ్వాల్సిందే. ఇది ఎంత వరకు అమలవుతోందన్నది ప్రశ్నార్థకమే.

# సమస్యల ఒడిలో సర్కారు బడి

తాండూరు : తాండూరు మండలం మల్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో అరకొర వసతులతో వందల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో మల్కాపూర్, కొత్లాపూర్, కోటబాస్పల్లి, సంగెంకలాన్, మిట్టబాస్పల్లికి చెందిన 470 మంది విద్యార్థులు నమోదయ్యారు. వీరందరికీ ప్రతిరోజు మధ్యాహ్న భోజనం వండేందుకు వంట గది శిథిలమైంది. కొత్తగా వంటశాల నిర్మించకపోవడంతో మైదానంలో, తరగతి గదుల పక్కన ఆరు బయట వంట చేసేందుకు




సిబ్బంది అవస్థలు తప్పడంలేదు.కొన్ని సందర్భాల్లో భోజనం తయారు చేసేందుకు ఆలస్యమవుతుండగా విద్యార్థులు ఆకలితో వేచి చూడలేక ఇబ్బంది పడుతున్నారు.

కూలే దశలో శౌచాలయాలు

ఎప్పుడో కట్టిన శౌచాలయాలకు సకాలంలో మరమ్మతులు కరవయ్యాయి. తలుపులు లేవు, గోడలు దెబ్బతిని కూలిపోయే దశకు చేరినా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినులు, బాలురు, ఉపాధ్యాయులు నిత్యం అసౌకర్యానికి గురవుతున్నారు. బాలికల పరిస్థితి చెప్పనలవి కాకుండా ఉంటోంది. ఎడమవైపు ప్రహరీ నిర్మించకపోవడంతో ముళ్ల పొదల నుంచి పాములు, వరాహాలు, శునకాలు వస్తుండటంతో విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# మౌనంగా భరిస్తున్నారు..



హైదరాబాద్: గతేడాది వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, మహానిమజ్జన సమయంలో మూడు పోలీసు కమిషనరేట్లలో 300 మంది ప్రబుద్ధులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి వికృత చేష్టలను రికార్డు చేసి మరీ బుద్ధి చెప్పారు. కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. భర్త వెంట వచ్చిన భార్యలకు వారి చేష్టల వీడియోలు చూపినట్టు సమాచారం.

నంబరు తెలిసినా.. చనువిచ్చినా.. నగర శివారు ప్రాంతానికి చెందిన ఓ యువతి ఇంజినీరింగ్ చదివేటపుడు సహచర విద్యార్థితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. తరువాత అతడి ప్రవర్తన నచ్చక దూరంగా ఉంటోంది. ఇది భరించలేని అతడు మార్ఫింగ్ ఫొటోలతో ఆమెను వేధించసాగాడు. సామాజిక మాధ్యమాల్లో విషప్రచారం ప్రారంభించాడు.బంజారాహిల్స్‌లో ఉంటున్న ఐటీ ఉద్యోగిని. రెండేళ్ల కిందట భర్త నుంచి విడిపోయి వేరుగా ఉంటుంది. మరో పెళ్లికి సిద్ధమవుతున్నట్లు తెలుసుకున్న మాజీ భర్త వేర్వేరు ఫోన్ నంబర్లతో ఆమెకు నరకం చూపుతున్నాడు.

ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. మూడు పోలీసు కమిషనరేట్లలో ఏటా 8000-9000 వరకూ ఫిర్యాదులు అందుతుంటాయి. వీటిలో కొన్ని ఎఫ్ఐఆర్, అధికశాతం పెట్టీ కేసులు నమోదు చేస్తుంటారు. పాఠశాల విద్యార్థినుల నుంచి గృహిణుల వరకూ వేధిస్తున్న వారిలో 80శాతం తెలిసినవాళ్లే ఉంటున్నారు. స్నేహం, ప్రేమ, బంధుత్వాలను అడ్డుపెట్టుకొని వికృతాలకు పాల్పడుతున్నట్టు దర్యాప్తులో తేలింది.

సామాజిక మాధ్యమాల ఆధారంగా..

ఇటీవల ఇన్‌స్టాగ్రాం, స్నాప్‌ఛాట్, వాట్సాప్ గ్రూపుల ద్వారా అమ్మాయిల నంబర్లు సేకరించి ముగ్గులోకి లాగుతున్నారు. కొందరు అమ్మాయిల పేర్లతో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి ఛాటింగ్ చేస్తున్నారు. ఆడపిల్లనుకొని వ్యక్తిగత వివరాలు పంచుకుంటున్నారు. అడగ్గానే నగ్నఫొటోలు, వీడియోలు పంచుకుంటున్నారు. ఇటీవల ఓ యువకుడు సుమారు 100 మందికిపైగా యువతుల వ్యక్తిగత ఫొటోలు సేకరించి బెదిరింపులకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది.

ఇటీవల నమోదవుతున్న కేసుల్లో అధిక శాతం సామాజిక మాధ్యమాలు, ఫోన్ ద్వారా బెదిరింపులు, వేధింపులకు పాల్పడుతున్నవే ఉంటున్నాయి. ఏదో ఒక సందర్భంగా ఫోన్ నంబర్లు ఇవ్వటం, తెలిసినవాళ్లు/పరిచయస్తులనే ఉద్దేశంతో చనువుగా మెలగటం అవకాశంగా తీసుకొని అవసరం తీర్చుకునేందుకు సిద్ధపడుతున్నారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

ఏవీ రంగనాథ్, జాయింట్ కమిషనర్ (సీసీఎస్, సిట్)

'బహిరంగ ప్రదేశాలు, పనిచేసే చోట వేధింపులు ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. పోలీస్ స్టేషన్‌కు వెళ్తే పరువు పోతుందని చాలామంది ముందుకు రావడం లేదు. అదే అదనుగా పోకిరీలు రెచ్చిపోయి మరింత ఇబ్బందులకు గురిచేస్తారు. సమస్యను కుటుంబ సభ్యులతో చెప్పాలి. తల్లిదండ్రులు అండగా ఉండాలి. సామాజిక మాధ్యమాల్లో వేధింపులను ఉపేక్షించొద్దు'

# నిర్మాణానికి ఆర్భాటం.. వినియోగానికి తాత్సారం



తాండూరు : గ్రామాల్లో పాలనా సౌలభ్యం కోసం పంచాయతీ భవనాల నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. వీటితో సకాలంలో నిర్మించి అందుబాటులోకి తేవాలి. కానీ జిల్లాలో సంవత్సరాలు గడిచినా భవనాలు సమకూరడం లేదు. కొన్నిచోట్ల ఆర్భాటంగా నిర్మించినా నిరుపయోగంగా పడేస్తున్నారు. మరికొన్నిచోట్ల అసంపూర్తిగా ఉండటంతో గ్రామీణ ప్రజలు, ప్రజా ప్రతినిధులకు ఇబ్బందులు తప్పడం లేదు. సర్కారు నిధులు మంజూరు చేసినా ఉపయోగం లేకుండా పోతోందన్న విమర్శలు వెలువడుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పంచాయతీ భవనాల్ని అందుబాట్లోకి తెచ్చేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్ర రూర్బన్ పథకం కింద కేటాయింపు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూర్బన్ పథకంలో భాగంగా తాండూరు డివిజన్లో 16 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించారు. వీర్‌శెట్టిపల్లి, చిట్టిగణాపూర్, చింతామణిపట్నం, గౌతాపూర్, కోటబాస్పల్లి, కొత్లాపూర్, గుంతబాస్పల్లిలో నిర్మాణాలను పూర్తి చేయించి అందుబాట్లోకి తెచ్చారు. రాంపూర్‌తండా, ఓగీపూర్, వీరారెడ్డిపల్లి నిర్మాణాలు పూర్తయ్యాయి. ఆరు నెలలు గడిచినా భవనాలను ప్రారంభించకపోవడంతో వినియోగంలోకి రాలేదు. దీంతో రంగులు వేసి అందంగా ముస్తాబు చేసిన భవనాలు నిరుపయోగంగా మారాయి.

శిథిల భవనాలు, తరగతి గదులే దిక్కు

చెంగెష్‌పూర్, జిన్‌గుర్తి, మల్కాపూర్, సంగెంకలాన్‌లో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి.

జిన్‌గుర్తిలో పంచాయతీ భవనాల్లేక ఇరుకైన మీసేవ భవనాల్లో నిర్వహిస్తున్నారు. చెంగెష్‌పూర్, రాంపూర్‌తండాలో ప్రభుత్వ పాఠశాల తరగతి గదిలో కొనసాగిస్తున్నారు.

వీరారెడ్డిపల్లి, ఓగీపూర్‌లో దశాబ్దాల క్రితం నిర్మించిన ఇరుకైన శిథిలావస్థ భవనాల్లో నిర్వహిస్తుండగా పాలకవర్గ సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చెట్టు కింద గ్రామసభలు ఏర్పాటుచేయాల్సిన పరిస్థితి.

త్వరలో అందుబాటులోకి తెస్తాం

-నందిని, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, తాండూరు

చిన్నచిన్న పనులు పూర్తి కానందున ప్రారంభోత్సవం చేయించలేదు. వాటిని పూర్తి చేయించి త్వరలో వినియోగంలోకి తెస్తాం. మిగిలిన భవనాలకు తొందరలోనే అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తాం.

ఇదీ లెక్క

మంజూరైన నిధులు.. రూ.3.2 కోట్లు

ఒక్కో దానికి కేటాయింపు.. రూ.20 లక్షలు

నిర్మాణ లక్ష్యం.. 16

పూర్తయినవి.. 8


అసంపూర్తి.. 8

# అధికారుల తప్పులు.. తల్లిదండ్రులకు తిప్పలు

హైదరాబాద్: రాజధానిలో జనన, మరణ ధ్రువపత్రాల జారీ గందరగోళంగా మారింది. కొందరు అధికారులతో కలిసి కంప్యూటర్ ఆపరేటర్లు, మీసేవా కేంద్రాలు దందా నడిపిస్తున్నాయి. నేరుగా వచ్చే దరఖాస్తుదారులను తప్పుదారి పట్టిస్తున్నాయి. ఇంటిపేరులో, పేరులో అచ్చు తప్పులను సృష్టించి.. వారిని మళ్లీ మళ్లీ తమ చుట్టూ తిప్పుకొంటున్నాయి. ఒక నెలలో జారీ అయ్యే సర్టిఫికెట్ల సంఖ్యలో.. సవరణకు వచ్చే దరఖాస్తులు 10 నుంచి 20శాతం మేర ఉండటమే అందుకు నిదర్శనం. ఆయా సవరణ దరఖాస్తుల్లో చాలా వరకు ఆమోదానికే నోచుకోవట్లేదు. దాని వల్ల.. చిన్నారుల ఆధార్‌కార్డులు, జీవిత, ఆరోగ్య బీమాలను పొందడంలో, చదువు విషయంలో సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఇదిగో ఉదాహరణ..

మెదక్ జిల్లా అల్లాదుర్గ్ గ్రామానికి చెందిన శంకురి సాయిలు, అనురాధ దంపతులు మార్చి 25, 2021న పాతబస్తీలోని పేట్లబురుజు ఆస్పత్రిలో బిడ్డకి జన్మనిచ్చారు. ఏడాది తర్వాత జనన ధ్రువపత్రం కావాలని జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. పాప పేరును 'శంకురి కార్తీక సాగర్'గా రాయాలని దరఖాస్తుదారు మీసేవా ఆపరేటర్‌కు చెప్పారు. కానీ.. పాప పేరుతోపాటు తల్లిదండ్రులిద్దరి పేర్ల పక్కన 'సాగర్'ను చేర్చారు. జీహెచ్ఎంసీ గుడ్డిగా ఆమోదించింది. తమ పేర్ల పక్కనున్న 'సాగర్'ను తొలగించాలంటూ రెండుసార్లు అర్జీ పెట్టుకున్నారు. సహాయ వైద్యాధికారి శ్రీకాంత్ తిరస్కరించారు.




సమస్యపై సదరు అధికారిని వివరణ కోరగా.. తల్లిదండ్రుల పేర్లను సవరించే అధికారం తనకు లేదని, గెజిట్ తీసుకోవాలన్నారు.

అధికారులకే అవగాహన లేమి..

జనన, మరణాల నమోదు చట్టం గురించి పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న అధికారులు లేరనే విమర్శలున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్లు, పలు మీసేవా నిర్వాహకులు చెప్పినట్లుగా వ్యవహరిస్తుంటారని కిందిస్థాయి సిబ్బందే చెబుతుంటారు. లంచం ఇవ్వకపోతే.. వివిధ కారణాలతో తిరస్కరించే దరఖాస్తులు ప్రతినెలా వందకుపైగా ఉంటున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించే శిశువుల జనన ధ్రువపత్రాల్లో ఎక్కువగా అచ్చు తప్పులను ఉద్దేశపూర్వకంగా సృష్టిస్తుంటారని, కేంద్ర కార్యాలయం ఆయా సమస్యలను తరచుగా సమీక్షించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


# ఇక్కడ వేగం.. అక్కడ జాప్యం

గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వినియోగించిన మురుగు నీరు ఎలాంటి శుద్ధి చేయకుండానే నదిలోకి చేరుతోంది. రామగుండం నగరపాలక సంస్థ రెండు, సింగరేణి ఒక ఎస్టీపీ ప్లాంటు నిర్మించాలని నిర్ణయించాయి. ఓసీపీ-5 ఏర్పాటు సమయంలో సింగరేణి యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు 17 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇక నగరపాలక సంస్థ 21 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మల్కాపూర్ శివారులో చేపట్టాల్సిన ఎస్టీపీ పనులు ఇంకా మొదలు కాలేదు. తాగునీరు కలుషితం గోదావరినది నుంచి సేకరిస్తున్న తాగునీరు కలుషితమవుతోంది. నేరుగా గోదావరి నదిలోంచి నీటిని తరలించి శుద్ధి చేయడంతో పాటు క్లోరినేషన్ చేసిన తర్వాత సరఫరా చేస్తున్నారు. ఈ నీరు దుర్వాసన రావడంతో పాటు మలినాలు వస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఒకవైపు నగరంలో వినియోగించిన మురుగు నీటితో పాటు పారిశ్రామిక ప్రాంతం నుంచి రసాయనాలు కలిసిన నీరు సైతం గోదావరిలో కలుస్తోంది. దీంతో తాగునీరు కలుషితమవుతోంది. రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎస్టీపీ నిర్మించాలంటే మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. అమృత్ 2.0 లో నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించడంతో అవి మంజూరు కావడానికి సమయం పట్టే అవకాశం ఉంది.ఇక్కడ కనిపిస్తున్నది సింగరేణి నిర్మిస్తున్న ఎస్టీపీ ప్లాంటు సెటిలింగ్ పాండ్. ఏడాది క్రితం మొదలు పెట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. మార్చి వరకు అందుబాటులోకి వచ్చే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రూ.22 కోట్ల వ్యయంతో 17 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ పర్‌డే) మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో ఈ ప్లాంట్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సెటిలింగ్ పాండుతో పాటు మిగతా నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయి. మెకానికల్, ఎలక్ట్రికల్ పరికరాలు బిగించాల్సి ఉంది. చుట్టూ ప్రహరీ నిర్మాణంతో పాటు అప్రోచ్ కాలువ పనులు చేపట్టాల్సిఉంది. రెండు నెలల్లో పూర్తి చేసే విధంగా పనులు సాగుతున్నాయి.ఇది నగరంలోని మురుగు నీరు. నగరపాలక సంస్థ ఎస్టీపీ ప్లాంటు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు ప్రతిపాదనలకే పరిమితమైంది. 21 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించాల్సిన మురుగునీటి శుద్ధి కేంద్రం పనులకు ఇంకా మోక్షం లభించడం లేదు. మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు తయారు చేశారు. నాగ్‌పూర్‌కు చెందిన సంస్థతో అధ్యయనం చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒకదశలో నిధులు కూడా మంజూరయ్యే దశకు చేరుకుంది. అయినా ఎలాంటి పురోగతి లేదు. తాజాగా అమృత్ 2.0 లో మరోసారి నగరపాలక అధికారులు రూ.25 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. అవి మంజూరైతే కాని పనులు మొదలు పెట్టే అవకాశం లేదు.

మార్చి నాటికి మురుగునీటి శుద్ధిచింతల శ్రీనివాస్, సింగరేణి ఆర్జీ-1 జీఎంమార్చి నాటికి మురుగు నీటిని శుద్ధి చేస్తాం. అప్పటి వరకు పనులు పూర్తవుతాయి. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. గోదావరిఖని పట్టణంలోని విఠల్‌నగర్, ఫైవింక్లైన్, మల్లికార్జున్‌నగర్, సీతానగర్, సంజయ్‌నగర్, పరశురాంనగర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో వినియోగించిన మురుగు నీరు 2-ఎ సమీపంలో నిర్మిస్తున్న ఎస్టీపీ వద్దకు చేరుకుంటాయి. రోజుకు 17 ఎంఎల్‌డీ మురుగు నీటిని శుద్ధి చేసి ఇతర అవసరాలకు వినియోగించుకుంటాం. మొక్కల పెంపకంతో పాటు బొగ్గు ధూళి లేవకుండా సీఎస్పీ, రహదారులపై చల్లిస్తాం. మిగిలిన నీటిని వ్యవసాయ అవసరాలకు చెరువుల్లోకి మళ్లిస్తాం.

# నైనీ గనిపైనే దృష్టి

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఒడిశాలోని న్యూపాత్రిపాద బొగ్గుబ్లాకును వదులుకుంది. నాలుగేళ్ల క్రితం సింగరేణికి ప్రభుత్వం కేటాయించిన న్యూపాత్రిపాద బొగ్గుబ్లాకును ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిసింది. ఒడిశాలో పదేళ్ల క్రితం కేటాయించిన నైనీ బొగ్గుబ్లాకు ద్వారానే బొగ్గు ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేసుకున్న సింగరేణి న్యూపాత్రిపాద బ్లాకును ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. ఏటా 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే లక్ష్యంతో న్యూపాత్రిపాద బొగ్గుబ్లాకులో సింగరేణి ఏర్పాట్లు చేసుకుంది. నైనీతో పాటు న్యూపాత్రిపాద గనులను ఏర్పాటు చేయాలని భావించింది. ఒడిశాలోని రెండు గనుల ద్వారా ఏటా 40 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయవచ్చని భావించింది. రెండు గనులకు మధ్య కేవలం 60 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండటంతో సింగరేణి సంస్థ ఇటు నైనీతో పాటు అటు న్యూపాత్రిపాదకు గనికి సంబంధించిన భూసేకరణ, అటవీ శాఖ అనుమతులకు సైతం ప్రయత్నాలు చేపట్టింది. ప్రభుత్వ భూమి ఎంత ఉందన్న విషయాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదికను సైతం తయారు చేసుకుంది. నైనీ బొగ్గుబ్లాకునకు సంబంధించి భూసేకరణ, అటవీశాఖ అనుమతులు కూడా తీసుకుంది. బొగ్గు రవాణాకు రైల్వే సైడింగ్ పనులు కూడా చేపట్టింది. న్యూపాత్రిపాదకు బొగ్గుబ్లాకునకు



సంబంధించి పనులు వేగంగా చేయకపోవడంతో సకాలంలో పనులు పూర్తి చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఒడిశాలో నైనీ బొగ్గుబ్లాకు తప్ప మరో గనిని ఏర్పాటు చేయలేమన్న అభిప్రాయానికి వచ్చిన సింగరేణి న్యూపాత్రిపాద గనిని కేంద్ర ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలుస్తోంది.

అపారమైన నిల్వలు

న్యూపాత్రిపాద బొగ్గుబ్లాకులో అపారమైన బొగ్గు నిల్వలున్నాయి. 500 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు నిక్షేపాలున్న గనిలో బొగ్గు పొరలు కూడా ఉపరితలంలోనే ఉన్నాయి. ఇక్కడ బొగ్గు ఉత్పత్తి చేపట్టడం ద్వారా వ్యయం తక్కువ అయ్యే అవకాశం ఉంది. నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం సింగరేణికి ఈ బొగ్గుబ్లాకులను కేటాయించింది. 1500 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న బొగ్గు నిక్షేపాలకు అటవీ ప్రాంతం అధికంగా ఉండటంతో అనుమతుల విషయంలో ఇబ్బంది తలెత్తే అవకాశం ఉండటంతోనే సింగరేణి సంస్థ దీనిపై ఆసక్తి చూపలేదు. సర్వేలు నిర్వహించడంతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించిన సింగరేణి అధికారుల బృందం ప్రాజెక్టును ప్రారంభించాలని భావించారు. ఇటీవలి కాలంలో అక్కడున్న పరిస్థితులను అధ్యయనం చేసిన అనంతరం తిరిగి కేంద్ర ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిసింది. దీంతో 1650 హెక్టార్లలో ఉన్న నైనీ బొగ్గుబ్లాకు నుంచి ఈ ఏడాది ఉత్పత్తి చేయాలని ఏర్పాట్లు చేస్తోంది. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్న సింగరేణి మొదటి సంవత్సరం 4 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టనుంది. ఆ తర్వాత ప్రతి సంవత్సరం బొగ్గు ఉత్పత్తిని పెంచుకునే అవకాశం ఉంది. నైనీ బొగ్గుబ్లాకు ప్రాంతంలో సైతం 500 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు నిక్షేపాలున్నాయి. ఈ గని సింగరేణికి ఆదాయ వనరుగా మారనుంది.

# ఆకాశం వైపు.. అన్నదాతల చూపు


ఖమ్మం : ఉభయ జిల్లాల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని మండలాల్లో భూమి పైపొరల్లో మాత్రమే కొద్దిపాటి తేమ ఉన్నా ఎండలకు ఆరిపోతోందని చెబుతున్నారు. నాటిన విత్తనాలు మొలకెత్తకపోవటంతో వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ఇప్పటివరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతి తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

పంట దిగుబడులపై ప్రభావం..

గతేడాది జులై 2 నాటికి అధిక వర్షాల కారణంగా గోదావరికి వరదలు వచ్చాయి. జులై 15 వరకూ విత్తనాలు వేసుకునే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఆలస్యంగా విత్తనాలు వేస్తే దాని ప్రభావం పంటల దిగుబడులపై ఉంటుందని అనుభవం ఉన్న రైతులు చెబుతున్నారు.

లోటు వర్షపాతం..

ఖమ్మం జిల్లాలో జూన్ 1 నుంచి 27 వరకు సాధారణ వర్షపాతం



114.8 మి.మీ.కాగా కేవలం 37.6 మి.మీ. మాత్రమే కురిసింది. భద్రాద్రి జిల్లాలో సాధారణ వర్షపాతం 142.3 మి.మీ. అయితే 59.4 మి.మీ. నమోదయ్యింది.

రానున్న ఐదు రోజుల్లో వాతావరణం ఇలా..

మంగళవారం విడుదలైన వ్యవసాయ వాతావరణ బులెటిన్ సమాచారం ప్రకారం ఖమ్మం జిల్లాలో అనేకచోట్ల గత మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురిశాయి. రానున్న ఐదు రోజుల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, అక్కడక్కడ అతి తేలికపాటి వర్షాలు కురవొచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 33.9 నుంచి 35.8 డిగ్రీల సెంటీగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రతలు 24.6 నుంచి 25.2 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదవుతాయి. ఈఆర్ఎఫ్ఎస్ వాతావరణ సమాచారం ప్రకారం ఆదివారం నుంచి జులై 8 వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం, సాధారణ పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయి.

# ఇంటి దొంగలను పట్టించు స్వామీ!

రామన్నపేట : వరంగల్ బాలానగర శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఒకటీ రెండు కాదు ఏకంగా తొమ్మిది వెండి చెంబులు మాయమై నెలన్నర రోజులైంది. ఇంతవరకు వాటి ఆచూకీ లేదు. నాలుగైదు రోజులు పోలీసులు, దేవాదాయ శాఖాధికారులు హడావుడి చేశారు. తర్వాత షరా మాములుగా వదిలేశారు. వెండి చెంబుల మాయం వెనుక ఇంటి దొంగలున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. మట్టెవాడ పోలీసులు ఇంతవరకు నిగ్గు తేల్చలేదు. వరంగల్ ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖాధికారులు శాఖాపరమైన విచారణ చేపట్టలేదు. దేవుడి మీద భక్తి, కోరుకున్న కోర్కెలు తీరాయనే నమ్మకంతో భక్తులు వెండి, బంగారు వస్తువులను దేవస్థానాలకు అప్పగిస్తున్నారు. వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కార్యనిర్వహణాధికారులు, అర్చకులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన దేవాలయాల్లోనూ విలువైన బంగారం, వెండి వస్తువులకు భద్రత కరవైంది. ఇంటి దొంగలను పట్టుకో ఈశ్వరా అని భక్తులు వేడుకుంటున్నారు.

ఇవిగో ఉదాహరణలు

మహబూబాబాద్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవాలయంలో భక్తులు ఇస్తున్న వెండి, బంగారం వస్తువులకు ఉద్యోగులు రసీదులు కూడా ఇవ్వడం లేదు. జాతరలు, పండగల సమయాల్లో భక్తులు, దాతలు ఇచ్చే వస్తువులు, నగదు వివరాలు సరిగ్గా లేవని తెలిసింది. హనుమకొండ జిల్లాలో రెండు ఆలయాల్లో ఏటా మూడు, నాలుగు నెలల పాటు పెద్దఎత్తున జాతర జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారు. భక్తులు దేవుడికి సమర్పించే వెండి, బంగారం వస్తువులకు జవాబుదారీతనం లేని రసీదులు జారీ చేస్తున్నారని తెలిసింది. గతేడాదిన్నర క్రితం ఒక అర్చకుడు భక్తుడి నుంచి నగదు తీసుకున్నారు. తీసుకున్నదాని కంటే తక్కువ బంగారం చూపించడంపై ఫిర్యాదు చేశారు. ఇదొక్కటే కాదు, పదుల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి.

ములుగు జిల్లాలో వన దేవతలకు భక్తులు సమర్పిస్తున్న వెండి, బంగారు వస్తువులకు రసీదులుండవు. మహా జాతర సమయంలో నిఘా ఉంటుంది. తర్వాత మామూలే. ఆదివారాలు, సెలవు దినాల్లో వేలాది మంది భక్తులు వస్తారు. దాతలు ఇస్తున్న వస్తువులు, నగదుకు సరైన రసీదులు ఇవ్వడం లేదు.

నగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన అమ్మవారి ఆలయంలో అనధికార అర్చకులు, ఒప్పంద ఉద్యోగులదే పెత్తనం. ఉదయం వేళల్లో పర్యవేక్షణాధికారి, ప్రభుత్వ ఉద్యోగులు ఉండటం లేదు. విధులకు ఆలస్యంగా వస్తున్నారు. అనధికార ఉద్యోగులే ఉంటున్నారు. విలువైన వస్తువులకు భద్రత ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

వరంగల్ ప్రాంతంలో మూడు, నాలుగు ఆలయాల్లో దేవుడి పేరుతో ఇస్తున్న బంగారు, వెండి వస్తువులను అర్చకులే తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈవోలకు కనీస సమాచారం ఉండటం లేదు.

వరంగల్ బట్టలబజారు శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో రెండేళ్ల క్రితం వెండి బిందె మాయమైంది. ఈఏడాది మే నెల 11వ తేదీన 9 వెండి చెంబులు మాయమైనట్లుగా గుర్తించారు. 14న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ దేవాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. ఈ విషయం రాష్ట్ర దేవాదాయ శాఖ ఆర్‌జేసీ దృష్టికెళ్లింది. ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైంది, నెలన్నరవుతున్నా ఇంతవరకు తేల్చలేదు. ఇంటి దొంగల వల్లే తరచుగా వస్తువులు మాయమవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇరుకు గదులు.. అర కొర వసతులు



ఖమ్మం : పిల్లల చదువులకు తల్లిదండ్రులు ప్రాధాన్యమిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు తమ పిల్లలను పట్టణాలు, నగరాల్లోని ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంచుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఖమ్మం జిల్లాలో బీసీ విద్యార్థులకు వసతి కష్టాలు తప్పడం లేదు. అనేక హాస్టళ్లు శిథిలావస్థకు చేరిన భవనాల్లో కొనసాగుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా..

33 ప్రభుత్వ బీసీ వసతిగృహాలు (పదోతరగతి లోపు విద్యార్థులకు 22) ఉన్నాయి. రెండు హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఖమ్మం ముస్తఫానగర్‌లోని బాలుర వసతిగృహం నిర్మించి సుమారు 40 ఏళ్లు అవుతోంది. భవనం లోపలి గదుల్లో పెచ్చులు ఊడుతున్నాయి. వర్షాకాలంలో కొన్ని గదులు కురుస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

వర్షాకాలం వస్తే ఇక్కట్లే

ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యనభ్యసించేందుకు బీసీ విద్యార్థులు ఖమ్మం నగరానికి వస్తున్నారు. జిల్లాలో అమ్మాయిలకు ఆరు, అబ్బాయిలకు ఐదు హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ఎనిమిది అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఖమ్మం నగరంలో అమ్మాయిల రెండు వసతిగృహాల భవనాలు పురాతనమైనవి. వాటి పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షాకాలం వస్తే ఇబ్బందే. చర్చికాంపౌండ్, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో పోస్టుమెట్రిక్ హాస్టల్స్ ఉన్నాయి. ఇక్కడి నుంచి ప్రభుత్వ మహిళా కళాశాల, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సుమారు 4 కి.మీ దూరంలో ఉంటాయి. అమ్మాయిలు రోజు నడుచుకుంటూ కళాశాలకు వెళ్లి వస్తుంటారు. కళాశాలకు దగ్గర్లో వసతిగృహం నిర్మించాలని కోరుతున్నారు. శాంతినగర్ సమీపంలోని ఓ అద్దె భవనంలో మా హాస్టల్ ఉంది. ఇరుకు గదుల్లో 40 మంది వరకు ఉండొచ్చు. ఎవరైనా ప్రవేశం కోసం వస్తే వెనుక్కు పంపుతున్నారు. అందరూ పేద విద్యార్థులు. హాస్టల్‌లో సీటు దొరకక బయట కిరాయికి గదుల్లో ఉండాలంటే చాలా కష్టం. సొంత భవనం నిర్మించి మరింత మందికి వసతిగృహంలో ప్రవేశాలు కల్పించాలి.

రావుట్ల హరినాథ్, డిగ్రీ విద్యార్థి

ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఖమ్మం నగరానికి వచ్చే బీసీ విద్యార్థులకు సరైన వసతిగృహాలు లేవు. అద్దె భవనాలు శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లు సరిగా లేవు. ఇరుకు గదులతో పాటు కళాశాలలకు దూరంగా ఉండటంతో బాలబాలికలు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాలు నిర్మించాలి.

వెంకటేశ్, జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌యూ జిల్లా వ్యాప్తంగా పాత భవనాల్లో నడుస్తున్న బీసీ వసతిగృహాల మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశాలిచ్చారు. సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలను సేకరిస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. జ్యోతి, జిల్లా అధికారిణి, బీసీ సంక్షేమశాఖ

# గతానికి భిన్నంగా.. ఎన్నికల సన్నద్ధత..!



ఖమ్మం : శాసనసభ ఎన్నికలకు ఉభయ జిల్లాల అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. లోటుపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. భారత ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎన్నికల ఏర్పాట్లు మొదలుపెట్టింది. గతంలో ఎన్నికలకు మూడు నెలల ముందు ప్రక్రియ ఆరంభమవుతుండగా ఈసారి దాదాపు ఐదు నెలల ముందే సన్నద్ధమవుతోంది. ఇప్పటికే స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు చేరగా.. ఫస్ట్ లెవల్ కమిటీ (ఎఫ్ఎల్‌సీ) పరిశీలన ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

ఉభయ జిల్లాలకు చేరిన సామగ్రి

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శాసనసభ ఎన్నికల ఏర్పాట్ల కసరత్తు ముమ్మరమైంది. జిల్లాల ఎన్నికల అధికారులుగా కలెక్టర్లు, ఓటింగ్ పరికరాల నోడల్ అధికారులుగా అదనపు కలెక్టర్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఎన్నికల సంఘం ఉభయ జిల్లాలకు చేరవేసింది. ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 1,439 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. పోలింగ్ నిర్వహణకు 3వేల బ్యాలెట్ యూనిట్లు, 2,100 ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్)లు, 2,100 కంట్రోల్ యూనిట్ (సీయూ)లను ఎన్నికల సంఘం సరఫరా చేసింది. భద్రాద్రి జిల్లాలో 1,092 పోలింగ్ కేంద్రాలున్నాయి. పోలింగ్ కోసం 1,976 బ్యాలెట్ యూనిట్లు, 1,867 వీవీప్యాట్లు, 1,540 కంట్రోల్ యూనిట్లు జిల్లాకు విడతల వారీగా చేరాయి.

త్వరలో మాక్ పోలింగ్..

రెండు జిల్లాల్లోనూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫస్ట్ లెవెల్ కమిటీ (ఎఫ్ఎల్‌సీ) పరిశీలన ప్రక్రియ సాగుతోంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధుల సమక్షంలో అనుమానాలు, అభ్యంతరాలను అధికారులు నివృత్తి చేస్తున్నారు. రోజుకు 200 చొప్పున ఈవీఎంలను పరిశీలిస్తున్నారు. ఎన్నికల సంఘం సూచన మేరకు త్వరలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. అత్యంత కీలకమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు, సీయూల పనితీరుపై అభ్యంతరాలు వ్యక్తం కానందున వాటిని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఖమ్మం జడ్పీ భవన సముదాయం, భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయాలను స్ట్రాంగ్ రూములుగా ఎంపిక చేశారు. కిటికీలు, వెంటిలేటర్లు లేకుండా వీటిని తీర్చిదిద్దారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అద్దె ఎద్దులతో అరక



ఖమ్మం : ఈ చిత్రంలో కన్పిస్తున్న యువకుడు కృష్ణాపురం గ్రామానికి చెందిన నునావత్ కాశీవిశ్వనాథ్. డిగ్రీ చదివాడు. వ్యవసాయంపై మక్కువ. కొంత భూమిని కౌలుకు తీసుకున్నాడు. అద్దెకు కాడెడ్లను తెచ్చి తన వ్యవసాయం చేసుకుంటాడు. మిగతా సమయాల్లో ఇతర రైతుల పత్తి, మిరప తోటల్లో అచ్చుతోలటం, పైపాట్లు వంటి పనులతో కొంత సంపాదిస్తుంటాడు. మధిర మండలం కృష్ణాపురం రైతు పోచేపల్లి వెంకటేశ్వరరావు తన వ్యవసాయం కోసం ఏపీలోని ఏలూరు జిల్లా ఓగిరాలతండా నుంచి జత ఎద్దులను అద్దెకు తెచ్చారు. మొత్తం రూ.35 వేలు ఖర్చు అయిందని, మిరప, పత్తి, సాగుకు ఉపయోగించిన తర్వాత అదే గ్రామానికి తరలిస్తానని తెలిపారు. గతంలో ప్రతి రైతు ఇంటా పశువులు కన్పించేవి. రోజులు మారుతున్నాయి. అన్నదాతలక పశుపోషణ భారమైంది. ఎన్ని యంత్రాలొచ్చినా కొన్ని పనులను కాడెడ్లతోనే చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో అద్దెకు కాడెడ్లు అందుబాటులోకి వచ్చాయి. సైకిళ్లు, యంత్రాల మాదిరిగానే ఈ సంస్కృతి విస్తరిస్తోంది. జూన్ నెల రాగానే గ్రామాలకు అద్దె ఎద్దులు వచ్చి చేరుతున్నాయి. మధిర మండలంలోనే ఏటా రెండు వందల జతల వరకు పనిచేస్తుండటం విశేషం.

అయిదు నెలలకు రూ.30 వేలు

ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రైతులు కాడెడ్లను అద్దెకు ఇస్తున్నారు. జూన్ నుంచి అక్టోబర్ ఆఖరు వరకు వీటితో ఇక్కడ వ్యవసాయ పనులు చేస్తారు. పత్తి, మిరప పంటల సాగులో దుక్కిలో అచ్చుతోలటం, పైరులో పైపాట్లు చేసేందుకు వీటిని ఉపయోగిస్తారు. కొంతమంది రైతులు ఎద్దులను అద్దెకు తీసుకుని వ్యవసాయ పనులు చేసుకుంటుండగా మరికొంత మంది వీటితో బాడుగ అరకలు తోలి సంపాదిస్తున్నారు. ఎకరాకు పైపాటు చేసినప్పుడల్లా రూ.700 తీసుకుంటారు. ఒక్కొక్కరు జత ఎడ్లతో ఏటా 50 ఎకరాలను మూడు సార్లు పైపాటు చేస్తారు. దీని వల్ల దాదాపు రూ.లక్ష సంపాదిస్తారు. అయిదు నెలల కాలానికి జత ఎడ్లకు అద్దె రూ.30వేలు, రానూపోను రవాణా ఖర్చులు రూ.5వేలు వెరసి రూ.35వేలు ఖర్చు అవుతుంది. దాణా, ఇతర మేత ఖర్చులకు మరో రూ.25వేలు వెచ్చించాల్సి వస్తుంది. తమ పనులు, అన్ని ఖర్చులు పోను ఇతర రైతుల పనుల రూపేణ రూ.40వేల వరకు మిగులుబాటు అవుతుందని ఓ రైతు వివరించారు.

క్షేమంగా అప్పగించాలి..ఏపీలోని నూజివీడు పరిసర గ్రామాలైన అన్నారావుపేట, ఓగిరాల తండా, నగరం, లైన్‌తండా తదితర గ్రామాలకు చెందిన కొంత మంది ఎద్దులను పోషిస్తున్నారు. మధిర, ఎర్రుపాలెం మండలాల రైతులు సరిహద్దులోని ఆయా ప్రాంతాలనుంచి అద్దెకు తీసుకొస్తున్నారు. ఒక్కొక్కరి వద్ద 20 నుంచి 25 జతలు అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటాయి. రైతులు అక్కడికి వెళ్లి నచ్చిన ఎద్దులను ఎంపిక చేసుకుని ట్రాలీల్లో తీసుకొస్తారు. వాటిని యజమానులకు తిరిగి క్షేమంగా అప్పగించాలి. మధ్యలో ఓసారి వచ్చి వాటిని చూసి వెళతారు. ప్రమాదాలు జరిగినా, ఏదైనా కారణంగా మృతి చెందిన అద్దెకు తీసుకున్న వారే భరించాలి. ఇదంతా నమ్మకం మీద జరిగే తంతు అని రైతులు చెప్పారు. ఖరీఫ్ వ్యవసాయం పైపాటు పనులు పూర్తవగానే వీటిని తిరిగి యజమానులకు పంపిస్తారు. ఆ తర్వాత వాటినే డిసెంబర్ నెలలో ధాన్యం, వరిగడ్డి, చెరకు తోలేందుకు గుంటూరు జిల్లాలోని రైతులకు అద్దెకు ఇస్తుంటారు.

# ప్రభుత్వ కళాశాలకు పాలనా సౌధం

ఖమ్మం : ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)కు ఎట్టకేలకు పరిపాలనా సౌధం అందుబాటులోకి వచ్చింది. ఎక్యుమలేటెడ్ నిధులు రూ.1.05 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈనెల 20న 'విద్యా దినోత్సవం' సందర్భంగా రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దీన్ని ప్రారంభించారు. కళాశాలకు ఎప్పటి నుంచో ఉన్న ప్రధాన సమస్య తీరింది. ఇప్పటి వరకు కళాశాల ఇరుకు గదుల్లోనే పరిపాలన విభాగానికి సంబంధించిన వ్యవహారాలు జరిగాయి. విశాలమైన రెండతస్తుల భవనంలో ఇక నుంచి పాలనా వ్యవహారాలు కొనసాగనున్నాయి.

# సర్కారు బడి... విజయాల ఒరవడి

ఖమ్మం : పేరుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల.. ఫలితాలు చూస్తే కార్పొరేటును తలదన్నే విధంగా ఉన్నాయి. ఉపాధ్యాయుల సమష్టి కృషి.. తల్లిదండ్రుల తోడ్పాటు, విద్యార్థుల పట్టుదల వెరసి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. క్రీడల్లో మేటిగా నిలుస్తున్నారు. పచ్చదనం, పరిశుభ్రతకు పెద్ద పీటవేస్తూ రెండుసార్లు స్వచ్ఛవిద్యాలయం పురస్కారం అందుకుంది. ఇదీ ముదిగొండ మండలం మేడేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఘనత..

ఫలితాల్లో సత్తా

పాఠశాలలో 187మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వారి ఉన్నతే లక్ష్యంగా ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందిస్తున్నారు. చదువు విలువను తల్లిదండ్రులకు వివరించి పిల్లలు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా చూస్తున్నారు. తరచు గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అందుకు కారణాలు తెలుసుకుంటూ వారు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. పదిలో నూరు శాతం ఉత్తీర్ణత పొందారు. జాతీయ ఉపకార వేతనాల ప్రతిభా పరీక్ష(ఎన్ఎంఎంఎస్)ల్లో ఏటా పలువురు విద్యార్థులు ఎంపిక



వుతున్నారు.క్రీడల్లో రాణింపు కబడ్డీ, ఖో–ఖో, అథ్లెటిక్స్, ఫుట్బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సీఎం కప్ ఫుట్బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని యామిని బంగారు పతకం సాధించింది. విద్యార్థినులు యామిని, యువవర్షిణి, లావణ్య, కావ్యలు ఫుట్బాల్ రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. అథ్లెటిక్స్, ఖో–ఖో, కబడ్డీ క్రీడల్లోనూ రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు.

ఇవీ ప్రత్యేకతలు..

విద్యార్థులకు శుద్ధజలం అందిస్తున్నారు. తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నారు. పచ్చదనం, పరిశుభ్రతకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రాధాన్యం ఇస్తారు. ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించారు. దీంతో రెండుసార్లు స్వచ్ఛవిద్యాలయంగా ఎంపికైంది.

సమష్టి కృషితోనే సాధన: భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు

ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవడం, ప్రత్యేక తరగతులు, పటిష్ట ప్రణాళిక అమలు ఇందుకు దోహదపడ్తున్నాయి. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ రెండుసార్లు స్వచ్ఛవిద్యాలయం పురస్కారం సాధించాం.

# కూలిన వంతెనతో రవాణా కష్టాలు

జనగామ : జనగామ–హుస్నాబాద్ రహదారిపై కూలిన వంతెనతో రాకపోకలకు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడ్లకొండ–గానుగుపహాడ్ మధ్య వాగుపై గతేడాది కురిసిన భారీ వర్షాలకు పాక్షికంగా దెబ్బతిన్న వంతెన నెల రోజుల కిందట పూర్తిగా కూలిపోయింది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ప్రస్తుతం వాహనాలను జనగామ–మద్దూరు రహదారిపై గానుగుపహాడ్ గ్రామం మీదుగా దారి మళ్లించారు. ఈ రోడ్డు ఇరుకుగా, గుంతలు పడి ఉండటంతో వాహనదారులు నానా అవస్థ పడుతున్నారు. వర్షాలు మొదలైతే రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు.

పనుల్లో ఆలస్యం..

జనగామ–హుస్నాబాద్ రహదారిపై శిథిలమైన కల్వర్టు స్థానంలో వంతెనను నిర్మించేందుకు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గతంలోనే ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించారు. టెండర్లు కూడా నిర్వహించారు. కానీ గుత్తేదారు పనులు ఆలస్యం చేశారు. ఈ క్రమంలోనే కల్వర్టు పూర్తిగా కూలి పోయింది. దీనిపై ఎమ్మెల్యే ముత్తిరెడ్డి స్పందించి మూడు, నాలుగు నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కానీ గుత్తేదారు ఇప్పుడు పనులు చేపట్టడం కష్టమని ఆసక్తి చూపడం లేదు. వర్షాకాలం పనులు సాగవని చెబుతూ వచ్చారు. ఎమ్మెల్యే ఒత్తిడి చేయడంతో 20 రోజుల కిందట పనులు ప్రారంభించినా.. ఆశించిన స్థాయిలో వేగవంతంగా పనులు సాగడం లేదు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు..

ఈ రహదారిపై కరీంనగర్, హుస్నాబాద్, తరిగొప్పుల, నర్మెట్ట, రఘునాథపల్లి, చిల్పూరు మండలాల నుంచి జనగామ మీదుగా సూర్యాపేట, హైదరాబాద్, హనుమకొండ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లేందుకు అనుకూలంగా ఉంది. వంతెన కూలిపోవడంతో వాహనాలను జనగామ–మద్దూరు రహదారిగా మీదుగా మళ్లించారు. సింగిల్ రోడ్డు ఇరుగ్గా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. భారీ వాహనాలు తిరుగుతుండటంతో గానుగుపహాడ్ సమీపంలో ఉన్న వంతెనపై భారంపడి అదికూడా కుంగిపోతోంది. దీంతో అధికారులు జనగామ–హుస్నాబాద్ వైపు వెళ్లే వాహనాలను జనగామ–మద్దూరు, నర్మెట్ట–వెల్దండ రహదారి మీదుగా, జనగామకు వచ్చే వాహనాలను నర్మెట్ట నుంచి ఆగపేట, మచ్చుపహాడ్, రఘునాథపల్లి మీదుగా మళ్లిస్తున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం..– అశోక్, ఆర్అండ్‌బీ డీఈ

జనగామ–హుస్నాబాద్ రహదారిపై వడ్లకొండ వద్ద వంతెన నిర్మాణ పనులను ఇటీవలే ప్రారంభించాం. కూలీలను సమకూర్చుకునేందుకు కొంత గడువు అవసరమైంది. మరో కొద్ది రోజుల్లో పనులు వేగవంతం చేసి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం.



# కుటుంబంలో చీలిక.. చేజేతులా జగన్ చేసుకున్నదే..

కాకినాడ: అభివృద్ధి లేకుండా రాష్ట్రం దయనీయ స్థితిలో ఉందంటే దానికి కారణం సీఎం జగనేనని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు. జిల్లాల పర్యటనలో భాగంగా కాకినాడలో పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. రాష్ట్రాన్ని, తన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ చీల్చిందంటూ బుధవారం జగన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు.

**ఎప్పుడు అవసరమొస్తే అప్పుడు అండగా ఉన్నా**: "వైఎస్ కుటుంబం చీలిందంటే దానికి కారణం.. చేజేతులా జగనన్న చేసుకున్నదే. అందుకు సాక్ష్యం దేవుడు, నా తల్లి విజయమ్మ, యావత్ కుటుంబం. వైకాపా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు 18 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. వాళ్లను మంత్రులను చేస్తానని చెప్పి మోసం చేశారు. పార్టీ కోసం నెలల తరబడి 3,200కి.మీ పాదయాత్ర చేశా. తెలంగాణలో ఓదార్పు యాత్ర చేపట్టా. సమైక్యాంధ్ర కోసం పాదయాత్ర కొనసాగించా. నా ఇంటిని, పిల్లలను పక్కన పెట్టి ఎండ, వానల్లో రోడ్ల మీదే ఉన్నా. ఎప్పుడు అవసరమొస్తే అప్పుడు స్వలాభం చూసుకోకుండా జగనన్న గెలుపునకు అండగా నిలబడి ప్రచారం చేశా. సీఎం అయిన రోజు నుంచి జగన్‌మోహన్‌రెడ్డి మారిపోయారు. నాకు వ్యక్తిగతంగా అన్యాయం చేసినా ఫర్వాలేదు.. రాజశేఖర్‌రెడ్డి పేరు, ఆశయాలు నిలబెడితే చాలు అనుకున్నా. జగన్‌తో పాటు ఆ పార్టీ వారంతా భాజపాకు బానిసలుగా మారారు. ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ లేకున్నా రాష్ట్రంలో భాజపా రాజ్యమేలుతోంది. రాష్ట్రానికి ఒక్క మేలు చేయకున్నా ఆ పార్టీకి ఎందుకు దాసోహమయ్యారు?

**వారసులమని చెప్పడం కాదు.. పనితీరులో కనపడాలి**: ప్రత్యేకహోదా కోసం ఏనాడూ జగనన్న ఉద్యమం చేయలేదు. కనీసం పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడింది లేదు. ఒక రాజధాని కాదు.. మూడు రాజధానులన్నారు. ఇవాళ అసలు రాజధాని ఉందా? లేదా? అనే అనుమానం కలుగుతోంది. ఆఖరికి విశాఖ స్టీల్‌ను కూడా భాజపాకు పణంగా పెట్టారు. స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చిన వారు ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్నారు. వైఎస్ ఆశయాలను నిలబెడతారని ప్రజలు జగన్‌ను సీఎంను చేశారు. ఆయన వారసులమని చెప్పడం కాదు.. పనితీరులో అది కనపడాలి. రైతును రాజశేఖర్‌రెడ్డి నెత్తిన పెట్టుకున్నారు. ఆయన ప్రభుత్వంలో వ్యవసాయం ఒక పండుగ.. ఇప్పుడు దండగగా మారింది. రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలనే ధ్యాసే లేకుండా పోయింది. ఉద్యోగ ఖాళీలనూ భర్తీ చేసే పరిస్థితి లేదు. వాలంటీర్ ఉద్యోగాలు ఇస్తే సరిపోతుందా?

**ఎంతో మంది త్యాగాలు చేస్తే జగన్ సీఎం అయ్యారు**: సీఎం ప్రజల వద్దకు వెళ్లరు.. వాళ్లు వచ్చినా కలవనీయరు. కనీసం ఎమ్మెల్యేలకు కూడా జగన్ కనపడరు. వైఎస్‌ను కలవాలంటే ప్రజాదర్బార్‌లో నేరుగా కలిసేవాళ్లు. ఎంతోమంది ఆస్తులు అమ్ముకొని త్యాగాలు చేస్తే జగన్ సీఎం అయ్యారు. అప్పటి నుంచి అందరినీ దూరం చేసుకున్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుండటం చూసి చలించిపోయా. నా కుటుంబం చీలిపోతుందని తెలిసినా ప్రజల కోసం కాంగ్రెస్‌లో చేరా. అద్భుత రాజధాని కావాలనేది మా పార్టీ ఉద్దేశం. కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదాపై రాహుల్‌గాంధీ తొలి సంతకం చేస్తారు" అని షర్మిల అన్నారు.




# ఎన్నికల్లో జగన్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

అమరావతి: రాజధాని అమరావతిని నాశనం చేయాలనుకున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించడం ద్వారా రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని ఆ ప్రాంత రైతులు హెచ్చరించారు. అమరావతి ఉద్యమం 1500 రోజులకు చేరిన సందర్భంగా రాజధాని పరిధిలోని మందడం, తుళ్లూరు, వెలగపూడి తదితర గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వెలగపూడిలో ఐకాస నేత పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ఇవాళ సమర శంఖం పూరిస్తామన్నారు. గత 1500 రోజులుగా పోరాడుతున్న రైతులు.. రానున్న ఎన్నికల్లో తప్పనిసరిగా రాజకీయ నిర్ణయం తీసుకుని జగన్‌ను ఓడిస్తారని చెప్పారు. మహిళా రైతులు మాట్లాడుతూ.. అమరావతికి భూములిచ్చిన రైతులను ఇబ్బందులు పెట్టిన జగన్.. రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన అనాలోచిత నిర్ణయంతో అనేక మంది చనిపోయారని, మరో రెండు నెలల్లో రాజధాని రైతుల కష్టాలు తీరబోతున్నాయని చెప్పారు.

# ప్రజా రాజధాని కోసం పోరాడుతున్న రైతులకు ఉద్యమాభివందనాలు: లోకేశ



అమరావతి: కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులకు ఎదురొడ్డి అమరావతి నిలబడిందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. అమరావతి పరిరక్షణకు రాజధాని రైతులు చేపట్టిన ఉద్యమం 1,500 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా లోకేశ్ ఎక్స్ (ట్విటర్)గా స్పందించారు. "ప్రజా రాజధాని కోసం 1500 రోజులుగా నియంతపై పోరాడుతున్న రైతులకు ఉద్యమాభివందనాలు. అమరావతి కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు. మీ ఆశయం త్వరలోనే నెరవేరుతుంది. రాష్ట్రం, భావితరాల భవిష్యత్తు కోసం భూమిని త్యాగం చేసిన రైతులకు న్యాయం జరుగుతుంది. అధర్మంపై ధర్మం విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

**జగన్ హ్యాండ్సప్... వైకాపా ప్యాకప్: లోకేశ్** – ఓడినా విచారం లేదంటూ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'జగన్ హ్యాండ్సప్... వైకాపా ప్యాకప్' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 2024లో ఆయన ఇక అధికారంలో ఉండరని, బై బై జగన్ అంటూ పేర్కొన్నారు.

# నకిలీ ఓట్ల చేరికపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి: చంద్రబాబు



అమరావతి: ప్రజల ఓట్లు తీసేయడం లేదా మార్చేసే దొంగలు రాష్ట్రంలోకి చొరబడ్డారని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. నకిలీ ఓట్ల చేరికలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయన 'ఎక్స్' (గతంలో ట్విటర్)లో పోస్ట్ చేశారు. ఎప్పటికప్పుడు మీ ఓటు ఉందా? లేదా? అని సరి చూసుకోవాలన్నారు. ఓటు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యానికి ఓటే పునాదని, భవిష్యత్తును మార్చుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిర్లక్ష్యం చేయొద్దన్నారు. పాలకులకు ప్రశ్నించే అధికారం ఇచ్చేది.. రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు మనల్ని నడిపించేది.. మంచి సమాజాన్ని నిర్మించేది ఓటేనని చంద్రబాబు పేర్కొన్నారు.

# జై భారత్ నేషనల్ పార్టీ మేనిఫెస్టో విడుదల

విజయవాడ: జై భారత్ నేషనల్ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసింది. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అధ్యక్షతన నడుస్తున్న జైభారత్ పార్టీ మేనిఫెస్టోను కొద్దిసేపటి క్రితం విడుదల చేశారు. విద్యార్థి, ఆటో డ్రైవర్, మహిళలు, రైతు ద్వారా మేనిఫెస్టోను లక్ష్మీనారాయణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈరోజు ఓటర్ల దినోత్సవమని.. ఓటు ప్రాధాన్యతను తెలిపే రోజని అన్నారు. అందువల్లే ఈ రోజు జై భారత్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేశామన్నారు. ఇది ప్రజల్లో నుంచి వచ్చిన మేనిఫెస్టో అన్నారు. కాబట్టే.. ఇది పీపుల్స్ మేనిఫెస్టో అని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టోను రూపొందించామన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం తాము పోరాటం సాగిస్తామన్నారు. అన్ని ప్రాంతాలను పరిశీలించి, ప్రజలతో మాట్లాడిన తర్వాత ఈ మేనిఫెస్టో తయారు చేశామన్నారు. అన్నదాత లేకుంటే మనం లేమని... రైతులను ఆదుకోవాలన్నారు. అన్నదాతల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా ఏపీని మార్చాలని లక్ష్మీనారాయణ అన్నారు.

**మేనిఫెస్టోలోని ముఖ్యాంశాలు..** స్వామినాథన్ ఉపాధి హామీ కింద ప్రతినెలా రైతులకు ఐదు వేలు. రైతు పండించే పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. సామాజిక వర్గాల పేరుతో రైతన్నలను జైభారత్ పార్టీ విడదీయదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి.. వారికి రుణాలు ఇచ్చేలా చేస్తాం. రైతులకు వడ్డీ లేని రుణాలు.. చట్టబద్ధంగా రైతు కమిషన్ ఏర్పాటు. విత్తన చట్టం తెస్తామని పదేళ్లుగా కేంద్రం చెబుతున్నా.. దానిని తీసుకు రావడం లేదు. రాష్ట్రస్థాయిలో విత్తన చట్టం తీసుకువచ్చి అమలు చేస్తాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు పదిహేను వేలు.. పదిహేను రోజుల్లో చెల్లించే ఏర్పాటు చేస్తాం. ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. ప్రతి నియోజకవర్గంలో ఒక భారీ పరిశ్రమ నెలకొల్పుతాం. సొంత ప్రాంతాల్లోనే ఉపాధి మార్గాలను చూపిస్తాం. పట్టణ ఉపాధి హామీ పథకం కూడా అమలు చేస్తాం ఏడాదిలో వంద రోజులు ఉపాధి హామీ కింద పనులు అప్పగిస్తాం. జైభారత్ పార్టీ ప్రతి ఏడాది జనవరి 26న రిపబ్లిక్ రోజున గ్రూపు వన్, గ్రూప్ టూ నోటిఫికేషన్, సెప్టెంబర్ లో ఉపాధ్యాయ పోస్టులు, అక్టోబర్ 21 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేస్తాం. అర్హత ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తాం.



# అన్ని ఆస్పత్రుల్లో క్యాష్‌లెస్

దిల్లీ: ప్రైవేటు ఆస్పత్రుల్లో ట్రీట్‌మెంట్‌కు సంబంధించి కీలక నిర్ణయం వెలువడింది. ఆరోగ్య బీమా తీసుకున్న వారు అన్ని ఆస్పత్రుల్లో 'క్యాష్‌లెస్' సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. గురువారం నుంచే అందుబాటులోకి వచ్చినట్లు 'ది జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్' వెల్లడించింది. జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలతో సంప్రదింపుల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఇన్సూరెన్స్ పాలసీ నెట్‌వర్క్ జాబితాలో పేరు లేని హాస్పిటల్‌లోనూ క్యాష్‌లెస్ సదుపాయాన్ని పొందొచ్చు. నెట్‌వర్క్ హాస్పిటల్ జాబితాలో లేని ఆస్పత్రుల్లో క్యాష్‌లెస్ సదుపాయం పొందేందుకు 48 గంటల ముందు ఇన్సూరెన్స్ కంపెనీకి తెలియజేయాలి. అత్యవసర సమయాల్లో అయితే ఆస్పత్రిలో చేరిన 48 గంటల్లోపు సమాచారాన్ని చేరవేయాల్సి ఉంటుంది. ఇన్సూరెన్స్ పాలసీ షరతులు, నిబంధనల ఆధారంగా క్లెయిం వర్తిస్తుందని కౌన్సిల్ పేర్కొంది ప్రస్తుతం ఏదైనా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో మాత్రమే క్యాష్‌లెస్‌కు అనుమతి ఉంది. క్యాష్‌లెస్ సదుపాయం లేని చోట ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చును జేబులోంచి చెల్లించాల్సి ఉంటుంది. తర్వాత రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండడం, రిఫండ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో కస్టమర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక నుంచి ఈ సమస్యలు తప్పనున్నాయి. 'క్యాష్‌లెస్' గురించి ఇప్పటికే ఆయా కంపెనీలు కస్టమర్లకు సందేశాలు పంపిస్తున్నాయి.



# మళ్లీ రెచ్చగొట్టిన కెనడా..

ఒట్టావా: భారత్ విషయంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వ్యవహరిస్తోన్న తీరుతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దిగజారుతున్నాయి. నిజ్జర్ హత్య విషయంలో ఇప్పటికే దౌత్యపరమైన విభేదాలు కొనసాగుతున్న వేళ.. తాజాగా ట్రూడో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఈ ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోస్తోంది. ఎన్నికల్లో విదేశీ జోక్యంపై జరుగుతోన్న దర్యాప్తులో భారత్ పేరును కెనడా చేర్చడమే ఇందుకు కారణం. తమ దేశంలో ఎన్నికలను ప్రభావితం చేసేందుకు చైనా యత్నించిందంటూ వెలువడిన కథనాల నేపథ్యంలో వాటిపై విచారణ నిమిత్తం ట్రూడో ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో ఒక స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పుడు భారత్ పేరును ఆ దర్యాప్తులో చేర్చారు. ఈ క్రమంలో 2019, 2021 ఎన్నికల్లో న్యూదిల్లీ జోక్యం ఆరోపణలపై సమాచారం ఇవ్వాలంటూ ఆ కమిషన్ తమ ప్రభుత్వాన్ని అడిగింది. దీనికి సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలిస్తామని, అలాగే ప్రతిపాదనలు చేస్తామని కమిషన్ తెలిపింది. చైనా, భారత్‌తో పాటు రష్యా వంటి దేశాలపైనా కెనడా ఈ ఆరోపణలు చేసింది. కానీ, వీటిని ఆయా దేశాలు ఖండించాయి. ఇక, ఈ కమిషన్ మే 3వ తేదీ నాటికి మధ్యంతర నివేదికను సమర్పించనుంది. ఈ ఏడాది చివరికల్లా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వనుంది. ఇదిలా ఉంటే.. గతేడాది జూన్‌లో ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ కెనడాలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందంటూ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు భగ్గుమన్నాయి. వాటిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలను సమర్థించే ఆధారాలు ఇవ్వాలని.. వాటిని పరిశీలించిన తర్వాతే ఈ కేసుపై తదుపరి చర్యలు తీసుకుంటామని న్యూదిల్లీ ఇప్పటికే పలుమార్లు కెనడాకు స్పష్టం చేసింది.

# దస్తగిరిని బలిపశువును చేశారు: షబానా




కడప: సీఎం జగన్ రెడ్డి, ఎంపీ అవినాశ్ రెడ్డిలపై దస్తగిరి భార్య షబానా ఆవేదనతో మండిపడ్డారు. నిన్న (బుధవారం) ఏపీ హైకోర్టు దస్తగిరికి బెయిల్ మంజూరు చేసింది. గురువారం ఆయన విడుదల కానున్నారు. ఈ సందర్భంగా దస్తగిరి భార్య షబానా కడపలో ఏబీఎన్- ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. 'నీ తమ్ముడు అవినాశ్ రెడ్డి తప్పు చేయకుంటే.. మీ పలుకుబడి, డబ్బులతో కోర్టులకెళ్లండి ఎక్కడకైనా వెళ్లండి.. పేదలమైన మమ్మల్ని ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారంటూ జగన్ రెడ్డిని ఉద్దేశించి ఆమె మండిపడ్డారు. వాళ్ల సుఖాల కోసం దస్తగిరిని బలిపశువును చేశారని ఆమె అన్నారు. జగన్ రెడ్డి, అవినాశ్ రెడ్డిలను తాను ఏనాడు విమర్శించలేదని, బాధను తట్టుకోలేక ఉన్నది ఉన్నట్లు చెబుతున్నానని షబానా అన్నారు. మమ్మల్ని చంపినా పరవాలేదన్నారు. "సొంతవారినే చంపారు.. మమ్మల్ని వదిలిపెడతారనే నమ్మకం నాకు లేదు. రూ.5 కోట్లు ఇస్తామని ఆశలు కల్పించి నా భర్త దస్తగిరి జీవితాన్ని నాశనం చేశారు. చేయని తప్పులకు నా భర్తను జైలుకు పంపించి బెయిల్ రాకుండా అడుగడుగునా అడ్డుకున్నారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. " మీరు తప్పు చేయనప్పుడు మీకు దమ్ము ధైర్యం ఉంటే దస్తగిరిని ఇబ్బంది పెట్టవద్దు. తెలంగాణ పోలీసులతో మాకు భద్రత కల్పించాలి. లేకపోతే మేము పులివెందులలో బ్రతకలేము. సునీతమ్మ డబ్బులిచ్చారని సీబీఐ అధికారులపై పలురకాలుగా చెప్పమని నా భర్త దస్తగిరిని బెదిరించారు" అని అన్నారు. కాగా కడప సెంట్రల్ జైలు నుంచి వైఎస్ వివేకా హత్య కేసు నిందితుడు దస్తగిరి గురువారం బెయిల్‌పై విడుదల కానున్నాడు. బుధవారం హైకోర్టు దస్తగిరికి బెయిల్ మంజూరు చేసింది. వివేకా హత్యకేసులో ఏ4 నిందితుడిగా ఉన్న దస్తగిరి అప్రూవర్‌గా మారాడు. దస్తగిరి నేడు విడుదల కానున్న నేపథ్యంలో ఆయన భార్య షబానా మాట్లాడారు. తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని.. ఏపీ పోలీసులపై తమకు నమ్మకం లేదని పేర్కొన్నారు. తమకు తెలంగాణ పోలీసులతో భద్రత కల్పించాలని మరోసారి షబానా విజ్ఞప్తి చేశారు.

# ఈ సౌకర్యం జగన్‌కు, భారతి రెడ్డికీ లేదు: అనిత




విశాఖ: 'వై నాట్ 175' నుంచి... సంతోషంగా దిగిపోతా అనే స్థాయికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిగిపోయారని తెలుగు దేశం పార్టీ మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఈ సందర్భంగా గురువారం విశాఖలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అవినీతి తోటలో రోజా పువ్వులు విరబోస్తున్నాయని, మంత్రి రోజా అవినీతిని నగరి పార్టీ నేతలు, ప్రజలే చెబుతున్నారన్నారు. చైర్ పర్సన్ పదవి కోసం రోజా తన బినామీలతో రూ.40 లక్షలు స్వాహా చేశారని, ఒక దళిత మహిళ దగ్గర డబ్బులు తీసుకుంటారా? అని ప్రశ్నించారు. బురదలో వికసించిన రోజా ఎందుకు తన అవినీతిపై స్పందించడం లేదని నిలదీశారు. 'నగరి రమ్మని అంటోంది.. జబర్దస్ పొమ్మంది.. గంజి నుంచి బెంజి వరకు వెళ్ళింది" అని కోట్లాది రూపాయలు ఆర్ టాక్స్ ద్వారా మంత్రి రోజా సంపాదించారని అనిత అన్నారు. జే టాక్స్‌కు అనుబంధం ఆర్‌టాక్స్‌ను రోజా వసూళు చేశారని, నగరిలో ఐదు మండలాను తమ కుటుంబ సభ్యులకు అప్ప జెప్పి.. డబ్బులు వసూళ్లు చేశారని ఆరోపించారు. పర్యాటక శాఖ అంటే... తను మాత్రమే పర్యటించే శాఖ అని రోజా అంటున్నారన్నారు. కోట్లాది రూపాయల విదేశీ పర్యటనకు ఖర్చు చేస్తున్నారన్నారు. 'రోజా రెడ్డి చెప్పులు పట్టుకోవడానికి ఉద్యోగి ఉన్నారు... ఈ సౌకర్యం జగన్‌కు.. భారతి రెడ్డికి లేదు' అని వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. చంద్రబాబు హయాంలో సీసాలు బద్దలు కొట్టిన రోజా... ఇప్పుడు కల్తీ మద్యం ఏరులై పారుతున్నా సీసాలు ఎందుకు బద్దలు కొట్టడం లేదని ప్రశ్నించారు. వైసీపీ నేతలు షర్మిల కాళ్ళు కడిగి ఆ నీళ్లు నెత్తిన జల్లు కోవాలన్నారు. ఆనాడు షర్మిల పాదయాత్ర చేస్తేనే.. వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు.

గ్రావెల్, ఇసుక, భూ ఆక్రమణలలో రోజా డబ్బులు సంపాదిస్తున్నారని, టీటీడీ దర్శనాల కోసం నెలకు రూ. 20 లక్షలు రోజా తీసుకుంటున్నారని, దేవుడితో పెట్టుకుంటే రోజాకు పుట్టగతులు ఉండవని అన్నారు.

**మంత్రి రోజాకు అనిత సవాల్..** మంత్రి రోజాకు వంగలపూడి అనిత సవాల్ చేశారు. తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, దమ్ముంటే రోజా ఏ తప్పు చేయలేదని ఏ గుడిలోనైనా ప్రమాణం చేయాలని సవాల్ చేశారు.

చంద్రబాబు, లోకేష్, షర్మిల నాన్ లోకల్ అని అంటున్నారని, మరి ఆనాడు షర్మిల పాదయాత్ర చేసి నప్పుడు ఆమె నాన్ లోకల్ కాదా? దీనికి వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రోజా పుట్టుపూర్వోత్తరాలన్నీ నాన్ లోకలేనని అన్నారు. షర్మిల ప్రశ్నలకు సిఎం జగన్ సమాధానాలు చెప్పాల్సి ఉందన్నారు. జగనన్న బాణం తిరిగి వైసీపీకే గుచ్చుకుంటోందని, ఆమె రాక వల్ల వైసీపీకి భారీగా గండి పడిందని వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు.

## బ్యూటీఫుల్ నమ్రత.. మహేష్ సర్ ప్రైజ్ పిక్

టాలీవుడ్ లో మోస్ట్ బ్యూటీఫుల్ కపుల్స్ లో ప్రిన్స్ మహేష్ బాబు- నమ్రతా శిరోద్కర్ జంట ఒకరు. వీరిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. మహేష్ జీవితంలోకి నమ్రత ప్రవేశించినప్పటి నుంచి ఆయన జీవితం కొత్త టర్నింగ్ తీసుకుందని అంటుంటారు. మహేష్ స్టైల్, లుక్ ఛేంజ్ వెనుక నమ్రత కీలక వ్యక్తిగా చెబుతుంటారు. కొన్నినెలల క్రితం మహేశ్ కూడా ఈ విషయాన్ని ఇన్ డైరెక్ట్ గా చెప్పారు. తన కాస్ట్యూమ్స్ విషయంలో సెలక్షన్ అంతా నమ్రదేనని చెప్పారు. అయితే మహేష్ యాడ్ షూట్స్ లో ఎక్కువగా బిజీ అవ్వడానికి ప్రధాన కారణం కూడా నమ్రతేనని టాక్ వినిపిస్తుంటోంది. నేడు నమ్రత 53వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా మహేష్ బాబు తన భార్యకు స్పెషల్ విషెస్ తెలిపారు. హ్యాపీ బర్త్ డే ఎన్ ఎస్ జీ అంటూ.. లవ్ సింబల్ యాడ్ చేసి ట్వీట్ చేశారు. నా జీవితంలో ప్రతి రోజును అద్భుతంగా తీర్చిదిద్దుతున్న నువ్వు ఈ ఏడాదిలో మరింత ప్రేమ, ఆనందంతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ



ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది చూసిన అభిమానులు కూడా నమ్రతకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. అయితే మహేష్ పోస్ట్ చేసిన పిక్ లో నమ్రత చాలా గ్లామరస్ గా ఉన్నారని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. 52 ఏళ్లు పూర్తైనా బ్యూటీఫుల్ గా ఉన్నారని చెబుతున్నారు. వదినమ్మ హ్యాపీ బర్త్ డే అంటూ ఆ పిక్ ను వైరల్ చేస్తున్నారు. నమ్రత.. ఎప్పటికీ మిస్ ఇండియానే అని అంటున్నారు. నమ్రత 1993లో మిస్ ఇండియా గా ఎంపికైన విషయం తెలిసిందే. హీరోయిన్ గా ఎన్నో హిందీ, తెలుగు సినిమాల్లో నటించి మెప్పించిన నమ్రత.. మహేష్ ను 2005 లో పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు పూర్తిగా దూరమయ్యారు. నటనతో ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న నమ్రత.. పెళ్లి పిల్లల తర్వాత మళ్లీ నటించాలని ఆమె అభిమానులు కోరుకున్నారు. కానీ నమ్రత మాత్రం పూర్తిగా ఫ్యామిలీకి సమయాన్ని కేటాయించారు. కాగా మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబోలో తెరకెక్కిన గుంటూరు కారం సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలై మిక్స్ డ్ టాక్ సంపాదించింది. అయితే ఈ సినిమా రిలీజ్‌కు ముందు గుంటూరులో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అభిమానులనుద్దేశించి మాట్లాడుతూ మహేష్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. మీరే నాకు అమ్మా, నాన్న అంటూ ఫుల్ ఎమోషనల్ అయ్యారు. దీనికి సంబంధించిన వీడియోను ఇన్ స్టాలో నమ్రత పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

## అక్కడుంటే అదే ఆలోచన : శ్రీలీల

రాఘవేంద్రరావు కొత్త పెళ్లి సందడితో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. తెలుగు మూలాలు ఉన్న శ్రీలీల హీరోయిన్ గా తెలుగు లో వరుసగా నటిస్తోంది. మొదటి సినిమా నిరాశ పరిచిన కూడా ధమాకా సినిమాతో ఈ అమ్మడు మొదటి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ధమాకా సినిమా తో వచ్చిన సక్సెస్ ను సద్వినియోగం చేసుకున్న ముద్దుగుమ్మ శ్రీలీల వరుస సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. ఆ మధ్య ఈ అమ్మడు ఏకంగా అర డజను సినిమాలను వరుసగా చేసింది. తాజాగా సంక్రాంతికి గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వరుస సినిమాలతో జోరు మీదున్న శ్రీలీల తాజాగా చిట్ చాట్ లో ఫ్యాన్స్ తో పలు విషయాలను పంచుకుంది. సినిమా సెట్స్ లో ఉన్న సమయంలో తాను సినిమా గురించి, అందులో తన పాత్ర గురించి తప్ప మరే విషయాలను ఆలోచించను. అందుకే తాను పాత్ర



విషయంలో మరియు డాన్స్ విషయంలో ఎక్కువ శ్రద్ధ పెట్టగలను అంటూ చెప్పుకొచ్చింది. షూటింగ్ సమయంలో ఇతర విషయాల గురించి ఆలోచిస్తే కచ్చితంగా ఆ ప్రభావం నటన పై పడుతుంది. అందుకే తాను సెట్స్ లో ఓపెన్ మైండ్ తో ఉంటాను.

చేయబోతున్న షాట్ గురించే ఆలోచిస్తాను అన్నట్లుగా చెప్పుకొచ్చింది. ఎక్కువ సమయం తీసుకోకుండా తక్కువ సమయంలోనే షాట్ ని పూర్తి చేసేందుకు హెూం వర్క్ చేస్తానని కూడా పేర్కొంది. చదువు విషయంలో కూడా తాను అలాగే ఉంటాను అంది. చదివేందుకు పుస్తకం ముందు పెట్టుకుంటే చదువు విషయం తప్ప మరేమి కూడా తాను ఆలోచించను అంటూ చెప్పుకొచ్చింది. తాను పుస్తకం పట్టి చదవడం మొదటి పెట్టాను అంటే ఇతర విషయాలు ఏవీ కూడా నాకు గుర్తుకు రావు అంది. ఒక పని చేసే సమయంలో మరో విషయం ఆలోచించకపోవడం మంచి అలవాటే అన్నట్టు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





## నటి ప్రగతి సౌత్ ఇండియన్ చాంపియన్




తెలుగు వెండి తెర ప్రేక్షకులకు అమ్మగా, అక్క గా, అత్తగా ఎన్నో సినిమాల్లో నటించి వినోదాన్ని పంచి సుపరిచితురాలు గా నిలిచిన నటి ప్రగతి గత కొన్నాళ్లుగా సోషల్ మీడియా ద్వారా తెగ వైరల్ అవుతున్న విషయం తెల్సిందే. అయిదు పదుల వయసుకు చేరువలో ఉన్న నటి ప్రగతి జిమ్ లో ఎక్కువ సమయం గడిపే వీడియోలు, ఫోటోలు షేర్ చేస్తూ ఉండేవారు. ఈ వయసులో ఈమె జిమ్ లో కష్టపడటం ఎందుకో అని కొందరు ఎద్దేవ చేశారు. అలాంటి వారు అందరికి కూడా చెంప పెట్టు అన్నట్లుగా ప్రగతి సమాధానం ఇచ్చింది. అరుదైన రికార్డును సొంతం చేసుకుని తెలుగు సినిమా ఇండస్ట్రీ మొత్తం తన వైపు తిరిగి చూసే విధంగా, తెలుగు సినీ ప్రేక్షకులు ఆశ్చర్యపోయే విధంగా చేసింది. నటి ప్రగతి పవర్ లిఫ్టింగ్ లో ఏకంగా సౌత్ ఇండియన్ చాంపియన్ గా నిలిచింది. సౌత్ ఇండియన్ పవర్ లిఫ్టింగ్ సీనియర్, జూనియర్ కాంపిటీషన్ 2024 లో ప్రగతి రెండో స్థానంలో నిలిచి సిల్వర్ పతకం సాధించింది. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ప్రగతి సాధించిన విజయానికి సినిమా ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. ప్రముఖ నటి అయ్యి ఉండి, ఈ వయసులో ఇలాంటి కష్టం ఏం పడుతాంలే అనుకోకుండా కష్టపడి పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ లో రెండో స్థానంలో నిలిచిన ప్రగతి అభినందనీయురాలు. ముందు ముందు ఆమె మరిన్ని విజయాలు సాధించాలని మనము కోరుకుందాం.

## శ్రీరాముని ఆశీస్సులు కోరిన 'స్వయంభు'




నిఖిల్ సిద్ధార్థ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'స్వయంభు'. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకుడు కాగా, ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్ - శ్రీకర్ నిర్మిస్తున్నారు. నిఖిల్ లెజెండరీ యోధుడి పాత్రలో నటించేందుకు ఆయుధ పోరాటం, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నాడు. భారీ యుద్ధ సన్నివేశాలతో అత్యంత భారీగా రూపొందనున్న ఈ చిత్రానికి ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ నెలకొంది. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయిక. రామ మందిర ప్రాణప్రతిష్ఠ రోజున స్వయంభు శ్రీరాముని ఆశీస్సులు కోరుతున్న పోస్టర్ ని రిలీజ్ చేసారు. ఇందులో టైటిల్ పాత్రధారి నిఖిల్ సిద్ధార్థ్ శ్రీరాముని దివ్యసముఖమునకు శిరస్సు వంచి నమస్కరిస్తూ తమ ప్రయత్నం విజయవంతం కావాలని ఆశీస్సులు కోరుతున్న దృశ్యం కనిపిస్తోంది. ఈ సినిమా నిఖిల్ కెరీర్ కి 20వ సినిమా కావడం ఆసక్తికరం. "భగవంతుడు శ్రీరాముడు అయోధ్య నుండి మనందరినీ అనుగ్రహించు ఈ మహత్తరమైన రోజున చస్వయంభు బృందం మర్యాద పురుషోత్తముని వేడుకను వైభవంగా జరుపుకుంది.. జై శ్రీ రామ్" అని చిత్రబృందం భక్తి, వినమ్రతను చాటుకుంటూ ఈ వ్యాఖ్యను జోడించింది. స్వయంభు టాలీవుడ్ లో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న భారీ చిత్రం. రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాహరన్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ చిత్రానికి వాసుదేవ్ మునెప్పగారి డైలాగ్స్ అందిస్తున్నారు. ఇంతకుముందు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో లెజెండరీ యోధుడిగా నిఖిల్ అద్భుతంగా కనిపించాడు. కార్తికేయ 2 తో బ్లాక్ బస్టర్ అందుకున్న అతడు రెట్టించిన ఉత్సాహంతో యుద్ధ వీరుడిగా నటిస్తున్నాడు.

## పొద్దు తిరుగుడు పువ్వులా శ్రీలీల!

శ్రీలీల బ్యూటీ గురించి చెప్పేదేముంది. అమ్మడు తొలి సినిమాతోనే తనలో బ్యూటీని లాంచ్ చేసింది. అదే సినిమాతో తనో గొప్ప డాన్సర్ అని ప్రూవ్ చేసింది. నటిగా..డాన్సర్ గా..అందగత్తెగా సక్సెస్ అయిన తర్వాత అవకాశాలు రాకుండా ఉంటాయా? ఛాన్సులన్నీ గుమ్మం ముంగిట క్యూలో నుంచోవా? వాటిని శ్రీలీల సద్వినియోగం చేసుకుపోదా? ప్రస్తుతం శ్రీలీల కెరీర్ ఎంత గొప్పగా సాగిపోతుందన్నది చెప్పాల్సిన పనిలేదు. చిన్న సినిమాతో మొదలైన అనతి కాలంలోనే స్టార్ హీరోలకు ప్రమోట్ అయిన భామ. రష్మిక తర్వాత ఆ రేంజ్ ఫాలోయింగ్ ని దక్కించుకున్న బ్యూటీగా నీరాజనాలు అందుకుంటుంది. ఇటీవలే గుంటూరు కారంతో మరో సక్సెస్ ని ఖాతాలో వేసుకుంది.



ప్రస్తుతం కొత్త అవకాశాలు క్యూలో ఉన్నాయి. ఇక అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం మరీ అంత యాక్టివ్ కాదు. అప్పుడప్పుడు మాత్రమే అభిమానులకు టచ్ లో ఉంటుంది. వాళ్లని మెప్పించే ఫోటోలు వదలుతుంది. వీలైనంత వరకూ పద్ధతైన దుస్తుల్లోనే కనిపిస్తుంది. బేసిక్ గానే ఒంగోలు బ్యూటీ కాబట్టి అందాలు ఆవిష్కరించడంలో మాత్రం కాస్త వెనుకా ముందు ఆలోచిస్తుంది. ఇక్కడి పద్ధతల్ని అనుసరించి ముందుకెళ్తుంది. అలా ఉండట ఆమెకి ఇక్కడ ప్రత్యేకమైన గౌరవాన్ని గుర్తింపుని తెచ్చి పెట్టింది. తాజాగా అమ్మడు చీరందంలో పొద్దు తిరుగుడు పువ్వులా వికసించింది. ఇదిగో ఇక్కడిలా షోల్డర్ లెస్ బ్లౌజు అందంలో కుర్రకారులో డబుల్ ఉత్సాహాన్ని నింపేసింది. అంతేనా మ్యాచింగ్ చీర లో అంతే బ్యూటీని ఆవిష్కరించింది. పసుపు.. సిమెంట్ రంగు చీరలో అమ్మడు ఎంతో అందంగా కనిపిస్తుంది. చేతిలో మొగ్గలు తొడిగిన కమలా మెగ్గలు పట్టుకుని మత్తెక్కించే చూపులతో కెమెరాకి ఫోజులిచ్చింది. నుదిటిన సన్నని బొట్టు..ముక్కుని మ్యాచ్ చేసేలా పెద్దదైన పుడక ధరించింది. బ్యాక్ గ్రౌండ్ లో గ్రీనరీ ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఈ ఫోటోని ఉద్దేశించి ఓ క్యాప్షన్ ఇచ్చేసింది. సూర్యకాంతిలో స్నానం చేసిన పొద్దు తిరుగుడు పువ్వును నేను అంటూ రాసుకొచ్చింది.

## సురేఖ కూతుర 22.. సినీ ఎంట్రీ ఎప్పుడంటే?

సోషల్ మీడియాను హీటెక్కించడంలో ముందు వరుసలో ఉంటున్నారు తల్లీకూతుళ్లు సురేఖావాణి, సుప్రిత. రెగ్యులర్ గా తమ అప్డేట్స్ ఇవ్వడమే కాకుండా మతి పోగొట్టే పిక్స్ షేర్ చేస్తూ కుర్రకారుకు గాలం వేస్తుంటారు. ఎప్పుడూ కొత్తగా ఆలోచిస్తూ నెటిజన్లను తమదైన కోణంలో అలరించడమే లక్ష్యంగా పెట్టుకున్న వారిద్దరూ.. అప్పుడప్పుడూ ఊహించని పిక్స్ నుస కూడా షేర్ చేస్తుంటారు. ముఖ్యంగా సురేఖ కూతురు సుప్రిత తన కొత్త ఫొటో షూట్ చేయడమే చాలు.. అమ్మడు హీరోయిన్ మెటీరియల్ అంటూ నెటిజన్లు రచ్చరచ్చ చేస్తుంటారు. సుప్రిత ఫొటోలకు లైకుల వర్షం కురిపిస్తుంటారు. పిక్స్, వీడియోలను సోషల్ మీడియాలో ఫుల్ ట్రెండ్ చేస్తుంటారు. టాలీవుడ్ ఎంట్రీ ఎప్పుడంటూ ప్రశ్నిస్తుంటారు. త్వరలోనే సుప్రిత.. సినీ ఎంట్రీ అంటూ కొందరు చెప్పేస్తుంటారు. అలా అనేక రూమర్లు కూడా



వచ్చాయి. తాజాగా సుప్రిత.. ఇన్ స్టాగ్రామ్ లో తన అభిమానులతో చిట్ చాట్ నిర్వహించింది. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. ఆ సమయంలో తన సినీ ఎంట్రీపై స్పందించింది. త్వరలో ఎంట్రీ ఉంటుందని ఇన్ డైరెక్ట్ గా చెప్పింది. దీంతో ఆమె ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. సుప్రిత అప్ కమింగ్ స్టార్ హీరోయిన్ అంటూ పోస్టులు పెడుతున్నారు. ఆమె గ్లామర్ పిక్స్ మళ్లీ వైరల్ చేస్తున్నారు. సినిమా అవకాశాలు పట్టేయడమే లక్ష్యంగా సుప్రిత ఇలా ఫొటోషూట్స్ చేస్తుందనే టాక్ ఎప్పటి నుంచో ఉంది. అయితే తన కూతురు సినీ ఎంట్రీ గురించి ఆ మధ్య సురేఖ మాట్లాడింది. తనకు సినీ ఎంట్రీ ఇష్టముంటే అడ్డు చెప్పనని చెప్పింది. ఓ సెలబ్రిటీ డాటర్ గా సినిమాల్లో రాకముందే బాగా పాపులర్ అయిన సుప్రిత.. ఇక వెండితెరపై ఎలా అలరిస్తుందో చూడాలి. అయితే చిట్ చాట్ లో మరిన్ని ఆసక్తికర విషయాలను కూడా సుప్రిత పంచుకుంది. తన ఏజ్ 22 అని చెప్పింది. స్టైలిష్ హెయిర్ తోపాటు స్కిన్ కేర్ సీక్రెట్ లను బయటపెట్టింది. తనకు బీచ్ లంటే చాలా ఇష్టమని తెలిపింది. వెకేషన్ కోసం థాయ్ లాండ్ కు వెళ్లి ఎంజాయ్ చేయడమంటే ఎంతో ఇష్టమని పేర్కొంది. లక్ష్యదీప్ కు వెళ్లి ఓ వీడియో చేయమని ఫ్యాన్ కోరగా.. అందుకు ఐడియా బాగుందని బదులిచ్చిందీ సుప్రిత.




## టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ గా మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి నియమితులయ్యారు.

ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆమోదించారు. దీంతో ఆయన టీఎస్పీఎస్సీ కొత్త ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. అంతకు ముందు ఈ పదవిలో జనార్దన్ రెడ్డి ఉన్నారు. పలు కారణాలతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు పలువురు సభ్యులూ రాజీనామా చేశారు.

వీటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వీటిని పరిశీలించిన ప్రభుత్వం.. మహేందర్ రెడ్డి పేరును ఖరారు చేసింది.

## ఆ బాధ్యత మీదే.. కేడర్‌కు రేవంత్ సూచనలు..



హైదరాబాద్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పార్టీలన్నీ సమాయత్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పార్టీ కార్యకర్తలను అప్రమత్తం చేశారు. తన సందేశా న్ని వారికి అందించారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన మంత్రులు, కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు, శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీ అభ్యర్థులు, జిల్లా పార్టీ అధ్యక్షులకు రేవంత్ నోట్ పంపారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ శాసన మండలి పట్టభద్రు ల నియోజకవర్గంలో నూతన ఓటర్ల నమోదు గడువు ఫిబ్రవరి 6న ముగుస్తున్నందున కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలని రేవంత్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించే బాధ్యత మీరు తీసుకోవాలని రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అశ్రద్ధ చేయకుండా ఈ కార్యక్రమాన్ని విధిగా చేపట్టాలని రేవంత్ కోరారు.

## మూసీ పరివాహకాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నాం: మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్: తెలంగాణ ప్రగతే తమ విజన్ అని, గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ఆపబోమని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కాకతీయలో నిర్వహించిన సీఐఐ తెలంగాణ ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. 3 దశాబ్దాలుగా స్థిరాస్తి రంగం ఎంతో పుంజుకుందని, ప్రతి రాష్ట్రం హైదరాబాద్ వైపే చూస్తోందని చెప్పారు. అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. "దావోస్ పర్యటనలో మౌలిక వసతుల పైనా చర్చించాం. సుస్థిరమైన విధానాలతో స్థిరాస్తి రంగం అభివృద్ధి కోసం కృషి చేస్తాం. విధానపరమైన నిర్ణయాల్లో పారిశ్రామికవేత్తల సహకారం కూడా అవసరం. రాష్ట్రం అభివృద్ధిలో మీరు కూడా భాగస్వాములు కావాలి. ప్రభుత్వం నుంచి మీకెలాంటి ఇబ్బందులూ ఉండవు. రష్యా లాంటి దేశాల్లోని పారిశ్రామికవేత్తలు కూడా హైదరాబాద్ వైపు చూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుస్తుందా? అని ఎన్నికల వేళ మాట్లాడుకున్నారు.. గెలిచి చూపించాం. ఇప్పుడు ఈ ప్రభుత్వం మూసీ నదిని ప్రక్షాళన చేస్తుందా? అని హేళనగా మాట్లాడుతున్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నాం. ఆరు గ్యారంటీలనూ అమలుచేసి తీరతాం" అని చెప్పారు.

## ఓటు విషయంలో ఆ బెదిరింపులను ఉపేక్షించవద్దు: గవర్నర్ తమిళిసై



హైదరాబాద్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడం తప్ప ప్రత్యామ్నాయ మార్గం లేదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. జేఎన్టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన 14వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో కేవలం 46% ఓటింగ్ నమోదైందని, అలాంటివి పునరావృతం కాకుండా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో తనకు ఓటు వేయకుంటే చనిపోతానని బెదిరించిన వారూ ఉన్నారని.. అలాంటి విషయాలను ఉపేక్షించవద్దని ఎన్నికల సంఘానికి గవర్నర్ సూచించారు.

ఓటు వేసేటప్పుడు అభ్యర్థులను పూర్తిస్థాయిలో విశ్లేషించి మంచి వారిని ఎన్నుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఇచ్చే సెలవును టూర్ల కోసం ఉపయోగించడం బాధాకరమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఓటు హక్కును వినియోగించుకోవడమే పౌరుల ప్రథమ బాధ్యతని చెప్పారు. ఓటరు దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు గవర్నర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో వికాస్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 1132 మందికి పోలీసు పతకాలు.. తెలంగాణకు 20, ఏపీకి 9

దిల్లీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ.. పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1132 మందికి గ్యాలంట్రీ/సర్వీసు పతకాలు అందజేయనుంది. ఈ మేరకు గురువారం అవార్డుల జాబితాను విడుదల చేసింది. ఇందులో 275 మందికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరికి ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 102 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 753 మందికి పోలీస్ విశిష్ట సేవా (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) పతకాలను ప్రకటించింది. గ్యాలంట్రీ పతకాలు దక్కించుకున్న 277 మందిలో అత్యధికంగా జమ్మూకశ్మీర్ నుంచి 72 మంది పోలీసులు, ఛత్తీస్‌గఢ్ నుంచి 26, ఝార?ండ్ నుంచి 23, మహారాష్ట్ర నుంచి 18 మంది ఉన్నారు. సీఆర్పీఎఫ్‌నుంచి 65, సశస్త్ర సీమాబల్ నుంచి 21 మంది ఈ పతకాలు అందుకోనున్నారు. లెఫ్ట్ వింగ్ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న 119 మంది, జమ్మూకశ్మీర్‌లో పనిచేస్తున్న 133 మందికి ఈ మెడల్స్ దక్కాయి.

**తెలుగు రాష్ట్రాల వారికి ఇలా..** ఈ పురస్కారాల్లో తెలంగాణ నుంచి 20, ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మందికి పతకాలు దక్కాయి. ఏపీలో 9




మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ఇవ్వనున్నారు. తెలంగాణ నుంచి ఆరుగురు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 12 మంది పోలీసు విశిష్ట సేవా పతకాలు అందుకోనున్నారు. తెలంగాణ అదనపు డీజీపీలు సౌమ్యా మిశ్రా, దేవేంద్ర సింగ్ చౌహాన్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు దక్కాయి. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ ఏటా రెండు సార్లు ఈ పోలీసు పతకాలను ప్రకటిస్తుంది.

## సొంత గూటికి కర్ణాటక మాజీ సీఎం జగదీశ శెట్టర్.. భాజపాలో చేరిక

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ సొంతగూటికి చేరుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన ఆయన.. తాజాగా మళ్లీ భాజపాలో చేరారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు ఇతర నేతలతో భేటీ అయిన అనంతరం పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాషాయ పార్టీ ఆయనకు టికెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

భాజపా కేంద్ర కార్యాలయంలో సీనియర్ నేతలు బీఎస్ యడియూరప్ప, ఆ పార్టీ కర్ణాటక అధ్యక్షుడు బీవై విజయేంద్ర.. శెట్టర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సభ్యత్వాన్నీ అందజేశారు. భాజపాలో తిరిగి చేరికపై శెట్టర్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని అవుతారనే విశ్వాసం ఉ ఒదన్నారు. పార్టీలోకి రావాలని యడియూరప్ప, ఇతర సీనియర్ నేతలతో పాటు పార్టీ కార్యకర్తలు కోరడంతో సొంత గూటికి చేరానన్నారు.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో భాజపా రాష్ట్ర నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన శెట్టర్.. కాంగ్రెస్‌లో చేరారు. హుబ్బళ్లి– ధార్వాడ సెంట్రల్ నుంచి హస్తం పార్టీ తరఫున పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఇక్కడ భాజపా నేత మహేశ్ 35వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ సమయంలో భాజపా అభ్యర్థి ఎన్నికల్లో నగదు పంచారంటూ ఆరోపణలు చేసిన ఆయన.. ఏడాది తిరగకముందే సొంతగూటికి చేరడం గమనార్హం.




## రణరంగంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ.. ముట్టడికి ఏబీవీపీ యత్నం.. ఉద్రిక్తత

హైదరాబాద్, జనవరి 25: నగరంలోని రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ రణరంగంగా మారింది. అగ్రికల్చర్ యూనివర్సిటీ ముట్టడికి ఏబీవీపీ యత్నించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. యూనివర్సిటీ 100 ఎకరాల ల్యాండ్‌ను హైకోర్టు నూతన భవనానికి కేటాయించడాన్ని విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జీవో 55ను రద్దు చేయాలని ఏబీవీపీ సైతం డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో యూనివర్సిటీ వంద ఎకరాల ల్యాండ్‌ను పరిశీలించేందుకు వచ్చిన ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారి తీసింది. యూనివర్సిటీ ముట్టడికి ఏబీవీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఏబీవీపీ కార్యకర్తల పట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. దీంతో వారు అడ్మిన్ బ్లాక్ ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు.

నిన్న ఏబీవీపీ కార్యదర్శి ఝాన్సిని జుట్టు పట్టి ఈడ్చిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా అగ్రికల్చర్ యూనివర్సిటీ ల్యాండ్‌ను హైకోర్టుకు ఇవ్వొద్దంటూ గత కొద్ది రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. పరిశోధనకు ఉపయోగపడే మొక్కలు ఉన్నాయని.. కావున ఆ భూములను తీసుకోవద్దంటూ విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

## సర్పంచ్ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యం కాదు: మంత్రి సీతక్క




వేములవాడ: సర్పంచులకు చెల్లించాల్సిన 16 నెలల బిల్లులు రూ.1200 కోట్లను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని మంత్రి సీతక్క ఆరోపించారు. ఎప్పటికప్పుడు సర్పంచుల బిల్లులు చెల్లిస్తే ఇలాంటి ఇబ్బందికర పరిస్థితి ఉండేది కాదన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని సీతక్క తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శన అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు.

ఉద్యోగులకు ప్రతినెలా 5లోపు జీతాలు, పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల సంక్షేమం కోసమే నిధులను వెచ్చిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యం కాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని మంత్రి చెప్పారు.

## ఏసీబీ సోదాలు: బాలకృష్ణ అక్రమార్జన.. అధికారులే కంగుతినేలా..!



హైదరాబాద్ : హెచ్ఎండీఏ మాజీ ఛైర్మన్, తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కార్యదర్శి శివ బాలకృష్ణను అక్రమాస్తుల వ్యవహారంలో దర్యాప్తు చేసే క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వందల కోట్ల ఆస్తుల్ని కూడబెట్టుకునేందుకు బాలకృష్ణ ఎలాంటి మార్గాల్ని అనుసరించాడో తెలిసి అధికారులే కంగుతింటున్నారు. పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల్లో శివబాలకృష్ణ బారీగా పెట్టుబడులు పెట్టినట్లు ఏసీబీ దర్యాప్తుల్లో వెల్లడైంది. అయితే.. రియల్ ఎస్టేట్ సంస్థలకు అనుమతులు ఇచ్చి.. ఆ లంచాలను పెట్టుబడుల్లోకి ఆయన మార్చుకున్నట్లు తేలింది. ఇందుకోసం హైదరాబాద్ శివారుల్లో వందల కొద్దీ ఆయన అనుమతులు ఇచ్చినట్లు తేలింది. హెచ్ఎండీఏ, రెరాలో పని చేస్తూనే ఆయన ఈ అనుమతులు జారీ చేసినట్లు గుర్తించారు. ఇక.. ఆయన్ని అదుపులోకి తీసుకున్న ఏసీబీ.. బంజారాహిల్స్ స్టేషన్‌ను తరలించి విచారిస్తోంది. ఆయన ఏ కంపెనీలకు, ఎవరెవరికి అనుమతులు ఇచ్చిందో ఆరా తీస్తోంది. మరోవైపు బంధువులు, మిత్రుల పేర్లు మీద కూడా ఎకరాల కొద్దీ ఆయన భూములు కొన్నారు. కొడకండ్లలో 17 ఎకరాలు, కల్వకుర్తిలో 26 ఎకరాలు, యాదాద్రిలో 23 ఎకరాలు, జనగామలో 24 ఎకరాల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 90 ఎకరాల భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బాలకృష్ణ ఆస్తుల కేసులో విచారణ కొనసాగుతోంది. కీలకమైన డాక్యుమెంట్లనే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటిదాకా బయటపడిన పత్రాలు, ఇతరాలను బట్టి.. ఆయన కూడబెట్టిన ఆస్తులు మార్కెట్ విలువ ప్రకారం రూ. 300–400 కోట్లు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. బుధవారం జరిగిన సోదాల్లో.. ఒక్క నానక్‌రామ్‌గూడ లోని బాలకృష్ణ ఇంట్లోనే రూ. 84 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఖరీదైన విల్లాలు, ఫ్లాట్లు.. నగర శివారు ప్రాంతాల్లో ఎకరాల కొద్దీ భూములు ఆయన వెనకేసినట్లు గుర్తించారు.

## హిట్ అండ్ రన్ కేసు.. యువతి సహా ఐదుగురి అరెస్ట్



హైదరాబాద్: హిట్ అండ్ రన్ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ తెలిపారు. ఏ1గా కొవ్వూరి రిత్విక్‌రెడ్డి, వైష్ణవి (ఏ2), పొలుసాని లోకేశ్వర్‌రావు (ఏ3), బుల్లా అభిలాష్ (ఏ4), ఏ5గా అనికేత్‌ను పేర్కొన్నట్లు చెప్పారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. "హిట్ అండ్ రన్ కేసులో తారక్‌రామ్ అక్కడికక్కడే మృతిచెందారు. ఏసు రాజుకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన తర్వాత పోలీసులు పట్టుకుంటారనే భయంతో రిత్విక్‌రెడ్డి పరారయ్యాడు. స్నేహితుడు సురేష్‌రెడ్డి ఇంట్లో కారును దాచిపెట్టారు. రిత్విక్ అమెజాన్‌లో జాబ్ చేస్తున్నాడు. ఆఫీస్ చూపిస్తానని స్నేహితులను తీసుకెళ్లాడు. మద్యం మత్తులో అతడు కారు నడిపినట్లు దర్యాప్తులో తేలింది. అందులో ప్రయాణించిన వారిని కూడా నిందితులుగా చేర్చాం. రిత్విక్‌రెడ్డిపై సెక్షన్ 304 (2) కింద.. మిగిలిన వారిపై 337 ఐపీసీ, 337, 187 ఎంవీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం" అని ఏసీపీ వివరించారు.

**ఏం జరిగిందంటే..** జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ గాంధీనగర్‌లో నివసించే లింగాల తారక్‌రామ్ (30) మాదాపూర్ నోవాటెల్‌లో బౌన్సర్. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు విధులు ముగించుకుని మరో బౌన్సర్ రాజుతో కలిసి జూబ్లీహిల్స్ మీదుగా బైకుపై గాంధీనగర్ బయల్దేరారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు వెళ్తుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొంది. తారక్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రాజును అటుగా వెళ్తున్న వాహనదారులు 108లో ఆసుపత్రికి తరలించారు. టీఆర్ నంబరుతో ఉన్న కారు ద్వారంపూడి నాగ పేరుతో ఉన్నట్లు సమాచారం. తారక్‌రామ్‌కు రెండేళ్ల క్రితం సుధారాణితో వివాహం కాగా 7 నెలల కుమారుడున్నాడు. ఉస్మానియాలో శవపంచనామా అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకొచ్చి జూబ్లీహిల్స్ ఠాణా ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలంటూ అతడి బంధువులు, బౌన్సర్లు నినాదాలు చేశారు. ఈ ఘటనకు కారు కారణంగా తాము భావిస్తున్నామని ఆరోపించారు. ప్రమాదానికి పాల్పడింది ఓ నాయకుడి కుమారుడని, నిజాలు వెల్లడించాలంటూ డిమాండ్ చేశారు.

## యూపీలో రోడ్డు ప్రమాదం.. 12 మంది మృతి




షాజహాన్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. షాజహాన్‌పూర్ జిల్లాలో ఆటోను ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో 12 మంది మృతి చెందారు. దట్టమైన మంచు కారణంగా గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. జలలాబాద్ నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న ఒక ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 12 మంది అక్కడికక్కడే మరణించారు. బరేలీ–ఫరూఖాబాద్ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది.

మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వివరాలు తెలియరాలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.**
**Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com**